Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 326 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 డిసెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## హోం మంత్రి వివరణ ఇవ్వాలి

న్యూఢిల్లీ : లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై ప్రతిపక్ష ఎంపీలు మండిపడ్డారు. కొత్త పార్లమెంటు భవనానికి ప్రస్తుతమున్న భద్రతా ఏర్పాట్లు సరిపోవంటూ కేంద్రంపై ధ్వజమెత్తారు. హోం మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని కొందరు, ఆయన రాజీనామా చేయాలని మరికొందరు డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఘటన గురించి విపక్ష ఎంపీలు లేవనెత్తారు. హోం మంత్రి వచ్చి వివరణ ఇవ్వాలని నినాదాలు చేశారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం లోక్‌సభ కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతున్నాయని, ప్రతి విషయాన్ని రాజకీయం చేయెుద్దని సూచించారు. కొంత సమయమిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ 'ప్రజలు చనిపోతుంటే మీరు టైం అడుగుతున్నార'ని వ్యాఖ్యానించారు.

# రేవంత్ వర్సస్ కేసీఆర్





## లోక్ సభలో ఎవరికెన్ని సీట్లు?

## మెజార్టీ కాంగ్రెస్‌కే - జాతీయ సర్వే సంచలనం..!!



హైదరాబాద్ : తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం కొలువు తీరింది. అప్పుడే ప్రభుత్వం పైన బీఆర్ఎస్ అస్త్రాలు సిద్దం చేస్తోంది. పాలనా పరంగా రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికలు రేవంత్ సమర్ధకు పరీక్షగా మారుతున్నాయి. అటు కేసీఆర్ ఓడినా..ప్రజల్లో ఆదరణ తగ్గలేదనేది బీఆర్ఎస్ అంచనా. ఈ సమయంలోనే ఇప్పటికిప్పుడు లోక్ సభ ఎన్నికలు జరిగితే తెలంగాణలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనేది ప్రముఖ జాతీయ సర్వే వెల్లడించింది.

**ఎవరికి ఎన్ని సీట్లు :** తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల దిశగా పార్టీలు అడుగులు వేస్తున్నాయి. పట్టు కొనసాగించేందుకు కాంగ్రెస్..తిరిగి తమ హవా కొనసాగాలంటే బీఆర్ఎస్..తమ సత్తా చాటుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నాయి.

ఈ సమయంలో ప్రముఖ జాతీయ సంస్థ టైమ్స్ నౌ- ఈటీజీ సంస్థ లోక్ సభ ఎన్నికల పైన సర్వే అంచనాలను వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనేది అంచనా వేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఈ సంస్థ వెల్లడించిన అంచనాలు దాదాపు వాస్తవం అయ్యాయి. ఇప్పుడు ఈ సంస్థ అంచనాలు..వెల్లడించిన ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి.

**సర్వే ఫలితాలు ఇలా :** టైమ్స్ నౌ- ఈటీజీ సంస్థ సర్వే అంచనాల మేరకు తెలంగాణలో కాంగ్రెస్ 8-10 స్థానాలు గెలిచే అవకాశం ఉందని వెల్లడించింది. అదే విధంగా బీఆర్ఎస్ 3-5 స్థానాలు దక్కించుకునే ఛాన్స్ ఉందని విశ్లేషించింది. బీజేపీ 3-5 స్థానాలు గెలుచుకొనే అవకాశం ఉందని పేర్కొంది. ఇతరులు ఒక స్థానం గెలుచుకుంటారని వెల్లడించింది. దీని ద్వారా కాంగ్రెస్ ఈ సారి తెలంగాణలో మెజార్టీ లోక్ సభ స్థానాలు గెలుచుకుంటుందని వివరించింది. బీఆర్ఎస్ లోక్ సభ ఎన్నికల్లోనూ పుంజుకొనే అవకాశం లేదని విశ్లేషించింది. అయితే, ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉందని..రేవంత్ పాలనా పరంగా తీసుకొనే నిర్ణయాలు ఆ పార్టీకి ఓట్లుగా మలచటంలో కీలకం కానుంది విశ్లేషకుల అభిప్రాయం.

**మారుతున్న లెక్కలు :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇప్పుడు రేవంత్ పైనే భారం మోపింది. లోక్ సభ ఎన్నికల వరకు రేవంత్ నే పీసీసీ చీఫ్ గా కొనసాగించాలని భావిస్తోంది. ఇదే సమయంలో కేసీఆర్ అలర్ట్ అవుతున్నారు. ఆరోగ్య పరంగా పూర్తిగా కోలుకున్న తరువాత ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. అటు బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుచుకోవటంతో పాటుగా ఓట్ షేర్ పెంచుకుంది. లోక్ సభ ఎన్నికలు ప్రధానంగా జాతీయ స్థాయి అంశాల ఆధారంగా జరిగే అవకాశం ఉండటంతో...మోదీ ఛరిష్మా తమకు కలిసి వస్తుందని అంచనా వేస్తుంది.

దీంతో..ఇప్పుడు ఈ సర్వే సంస్థ వెల్లడించిన ఫలితాలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో పెద్ద ఎత్తున చర్చకు కారణమవుతున్నాయి.




## తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్: నాలుగు రోజుల విరామం అనంతరం తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆయన్ను స్పీకర్ స్థానం వద్దకు సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ప్రసాద్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం, ప్రధాన ప్రతిపక్షం భారాసతో పాటు మజ్లిస్, సీపీఐ ఎమ్మెల్యేలు మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

**మంచి సంప్రదాయానికి తొలిరోజే నాంది: సీఎం రేవంత్ –** స్పీకర్ ఎన్నికకు సహకరించిన పార్టీలకు సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంచి సంప్రదాయానికి తొలిరోజే సభ నాంది పలికిందని, భవిష్యత్‌లోనూ ఇదే సంప్రదాయం కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను సభ ద్వారా నెరవేరుద్దామని చెప్పారు. మంత్రిగా ఉన్నప్పుడు గడ్డం ప్రసాద్ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించారని, ఆయనతో కలిసి పని చేసినందుకు గర్విస్తున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం దిశగా గడ్డం ప్రసాద్ సలహాలు ఇవ్వాలన్నారు. భారాస అధినేత కేసీఆర్ ఆదేశాలతో ఏకగ్రీవ ఎన్నికకు సహకరించినట్లు మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఎంపీటీసీ నుంచి స్పీకర్‌గా ఎదిగిన గడ్డం ప్రసాద్ జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభ పని చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ దేవాలయం లాంటిదని, ప్రజాస్వామ్య పరిపుష్టికి ఎమ్మెల్యేలు కృషి చేయాలన్నారు. అంతకుముందు పలువురు ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రమాణం చేశారు. ఆ తర్వాత భారాస నుంచి కేటీఆర్, పద్మారావు, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యుల ప్రమాణ స్వీకారాలు పూర్తయిన అనంతరం స్పీకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ అధికారికంగా ప్రకటించారు.

## బాధ్యతలు స్వీకరించిన భట్టి.. పలు శాఖలకు నిధులు విడుదల



హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. సచివాలయ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు శాఖలకు భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేశారు. వాటికి సంబంధించిన దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. ఆర్టీసీలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన సబ్సిడీ కింద రూ.374కోట్ల నిధులను విడుదల చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.298కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.996కోట్లు, మేడారం జాతర ఏర్పాట్లకు రూ.75 కోట్ల నిధులను విడుదల చేస్తూ సంబంధిత దస్త్రాలపై భట్టి విక్రమార్క సంతకాలు చేశారు.

## తెలంగాణలో కొత్త అడ్వకేట్ జనరల్ ఎవరు..ఆయనకే ఛాన్స్..!



హైదరాబాద్ : తెలంగాణ ప్రస్తుత ఏజీ ప్రసాద్ రాజీనామా నేపథ్యంలో కొత్తగా అడ్వకేట్ జనరల్ ఎవరు అన్నది ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది..తెలంగాణ ఉద్యమంతో పాటు సమర్థత,విశ్వసనీయతలకు పెద్ద పీట వేస్తూ అడ్వకేట్ జనరల్ ను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది..తెలంగాణ వచ్చిన తొమ్మిదన్నర ఏండ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది ఏజీ రాజీనామా ఆమోదం పొందితే జీపీ,ఏజీపీల నియామకాలన్నీ రద్దు అయ్యి వారి స్థానంలో కొత్త వారికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వానికి న్యాయస్థానంలో వెన్నుదన్ను లాంటి వ్యక్తి అడ్వకేట్ జనరల్, ఎన్నో కీలకం అయిన కేసులు న్యాయ స్థానం ముందుకు వచ్చినపుడు ప్రభుత్వం తరుపున వాదనలను గట్టిగా వినిపించాల్సిన భాధ్యత అడ్వకేట్ జనరల్‌ది. అందుకే ఈ నియామకం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది.ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పేర్లలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు చల్లా దామోదర్ రెడ్డి.గత మూడు దశాబ్దాల కాలంలో తెలంగాణ లాయర్స్ అసోసియేషన్ ని నెలకొల్పడం, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లీగల్ సెల్ అద్యక్షునిగా సమర్ధవంతంగా బాధ్యతలను నిర్వహించడం, తెలంగాణ మొట్టమొదటి లీగల్ సెల్ అధ్యకునిగా ఉండడం ఆయనకి కలిసి వచ్చే అంశాలు. అంతేకాకుండా మొట్టమొదటి ప్రదేశ్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గా ఉండి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ ను ఎత్తివేస్తే దానిని హైకోర్టులో సవాలు చేసి దర్నాచౌక్‌ను కాపాడిన వ్యక్తిగా అందరూ అనుకోవడం, అంతే కాకుండకాంగ్రెస్ పార్టీ నాయకులు దిగ్విజయ్‌సింగ్, అప్పటి కాంగ్రెస్ నేత గులాంనబీ అజాద్, కొప్పులరాజు, యువజన కాంగ్రెస్ నాయకులపై అలాగే ఫైర్ బ్రాండ్ నేత జగ్గారెడ్డి పై గత ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను విజయవంతంగా నిరోధించడం దామోదర్ రెడ్డికి అనుకూల అంశాలుగా ఉన్నాయి.

# టార్గెట్ మల్లారెడ్డి?

## రేవంత్ సర్కారు వేట మొదలైందా?



హైదరాబాద్ : మాజీ మంత్రి మల్లారెడ్డిని ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. పాలమ్మి.. పూలమ్మి.. ఇంత స్థాయికి వచ్చినట్లు ఆయన చెప్పుకున్నా.. పలు భూదందాలే ఆయన్ను ఇంత స్థాయికి తీసుకొచ్చాయన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తుండటం తెలిసిందే. మంత్రిగా ఉన్న వేళలోనూ ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావటం తెలిసిందే. అంతేకాదు.. అప్పట్లో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి.. మల్లారెడ్డి భూదందాలకు సంబంధించిన ఆరోపణల్ని ఆధారాలతో సహా నిరూపిస్తానని సవాలు విసరటం తెలిసిందే. అప్పట్లో మల్లారెడ్డి భూకబ్జా వ్యవహారాలపై ఇరువురు నేతల మధ్య మాటల తూటాలు పేలాయి. అప్పట్లో మల్లారెడ్డి మంత్రిగా వ్యవహరిస్తే.. రేవంత్ విపక్ష ఎంపీగా ఉండేవారు. మారిన కాలంతోపాటు.. కొత్త సమీకరణాల నేపథ్యంలో మంత్రి మల్లారెడ్డి మాజీ కావటం.. ఎమ్మెల్యేగా మాత్రమే గెలుపొందగా.. రేవంత్ మాత్రం ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో.. ఇప్పుడు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఇదిలా ఉంటే.. తాజాగా చోటు చేసుకున్న ఒక పరిణామం సంచలనంగా మారింది. పరిస్థితుల్ని చూస్తుంటే.. మల్లారెడ్డి అక్రమాలపై రేవంత్ నజర్ పడిందన్న మాట బలంగా వినిపిస్తోంది. తాజాగా మల్లారెడ్డి భూకబ్జాకు పాల్పడ్డారని పేర్కొంటూ భిక్షపతి అనే వ్యక్తి శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరంలో 47 ఎకరాల గిరిజన భూమిని మాజీ మంత్రి కబ్జా చేశారని ఆరోపించారు. దీనిపై స్పందించిన పోలీసులు మల్లారెడ్డిపై కేసు నమోదు చేయటం గమనార్హం. ఇదిలా ఉంటే.. రాజకీయంగా మల్లారెడ్డికి.. రేవంత్ కు అస్సలు పొసగదని చెబుతారు. అప్పట్లో రెడ్ల సామాజిక వర్గానికి చెందిన సమావేశంలో మంత్రిగా ఉన్న మల్లారెడ్డిపై దాడి జరగటం సంచలనంగా మారింది. అయితే.. ఆ ఉదంతంలో రేవంత్ పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో మల్లారెడ్డి సైతం ఇదే వ్యాఖ్యలు చేస్తూ.. రేవంత్ పై పరుష వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే.. తాజాగా రేవంత్ ముఖ్యమంత్రి కావటంతో మల్లారెడ్డిపై వచ్చే ఆరోపణలపై అధికారులు సీరియస్ గా నజర్ వేయాలన్న సంకేతాలు అందినట్లుగా చెబుతున్నారు. నిజానికి.. మల్లారెడ్డిపై మొదట్నించి భూకబ్జా ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. అయితే.. ఆయన అధికారపక్షంలో ఉండటంతో ఆయనపై వచ్చే ఆరోపణలు ముందుకు వెళ్లలేదు. అయితే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి.. రేవంత్ ముఖ్యమంత్రి అయిన నేపథ్యంలో కష్టాలు తప్పవంటున్నారు. జైలుకు పంపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

గరుడ వార్త



# సంపాదకీయం

## ఆ దర్యాప్తు సంస్థను ఇక రాష్ట్రాలు అడ్డుకోలేవు...

సరిగ్గా ఐదేళ్ల కిందట కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గట్టి గా ఢీకొట్టింది ఏపీలోని చంద్రబాబు సర్కారు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో భాగమైన టీడీపీ.. అందులోంచి బయటకు వచ్చాక భారీగా విమర్శలు చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఏపీపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పనుందనే కథనాలు వచ్చాయి. ఈ విషయాన్ని పసిగట్టిన చంద్రబాబు సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి జనరల్ కాన్సెంట్ (సాధారణ అనుమతి)ను ఉపసంహరించుకున్నారు. అంటే.. సీబీఐ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రాకూడదని అర్థం. సరిగ్గా ఆరు నెలల కిందట స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే సర్కారు కూడా సీబీఐకి జనరల్ కాన్సెంట్ ను వెనక్కుతీసుకుంది. విద్యుత్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియగానే ఈ పనిచేసింది. ఇవే కాదు.. ఈశాన్యాన ఉన్న మిజోరం కూడా ఇలానే చేసింది.

2015 నుంచి చూస్తే మిజోరం, 2018లో ఏపీ, పశ్చిమ బెంగాల్, 2020 లో కేరళ రాష్ట్రాల ప్రభుత్వాలు సీబీఐని రావొద్దని స్పష్టం చేశాయి.

**ప్రతిపక్ష ప్రభుత్వాలే టార్గెట్.. మూడేళ్లుగా చూస్తే :** మిజోరం నుంచి ఏపీ వరకు.. తమిళనాడు నుంచి పంజాబ్ దాకా.. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసి మరీ సీబీఐని వదులుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తాయి. పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ, జారండ్ లలో ఇలానే బీజేపీయేతర ప్రభుత్వాలు ఉండగా.. సీబీఐ రావొద్దంటూ అడ్డుకున్నాయి. మూడేళ్ల కిందట జార?ండ్ సైతం జనరల్ కాన్సెంట్ ను వెనక్కు తీసుకుంది. మొత్తమ్మీద చూస్తే 9 రాష్ట్రాలు ఇదే విధంగా తమ సాధారణ సమ్మతిని రద్దుచేశాయి.

**ఇకమీదట అలా చేయలేవు..** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తేనున్న చట్టం ప్రకారం సీబీఐకి రాష్ట్రాల సమ్మతితో పనిలేదు. ఆ మేరకు రాష్ట్రాల సమ్మతి, జోక్యంతో పనిలేకుండా దర్యాప్తు చేసే అధికారాన్ని సీబీఐకి ఇస్తూ కొత్త చట్టం చేయాలని ఓ పార్లమెంటరీ స్థాయీ సంఘం సోమవారం సిఫార్సు చేసింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షకు గురవుతున్నామనే భావనకు లోనవకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

**ఇది స్వాతంత్ర్య పూర్వ చట్టం..** సీబీఐ దర్యాప్తునకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కావాలి అని 1946 నాటి ఢిల్లీ ప్రత్యేక పోలీసు సంస్థ చట్టం నిర్దేశిస్తోంది. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాలు సీబీఐ దర్యాప్తునకు అనుమతి నిరాకరించాయి. జాతీయ భద్రత, దేశ సమగ్రతకు ప్రమాదం వాటిల్లిందని భావించే కేసుల్లో రాష్ట్రాల సమ్మతితో పని లేకుండా కొత్త చట్టం చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం 135వ నివేదిక సూచించింది. మరిప్పుడు కొత్త చట్టంతో ఏం జరుగుతుందో చూడాలి.

# జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

**డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పరిస్థితులపై ప్రతివారం సమావేశం ఏర్పాటు...**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : జిల్లా వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు శ్యామ్ప్రకాశ్ రాజేశ్కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎమ్సీ), సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్ అధికారుల నుంచి జిల్లాలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకొన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్రూమ్లు పూర్తయ్యాయి... ? ఎన్ని ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు ? ఇంకా ఎన్ని ఇళ్లు ఏఏ దశలో పెండింగ్ పనులు ఉన్నాయి ? ఫినిషింగ్ (పూర్తయ్యే స్థాయిలో) ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను ఆయా నియోజకవర్గాల అధికారులను అడిగి తెలుసుకొన్నారు. దీంతో పాటు ప్రస్తుతం అందచేసే డబుల్ బెడ్రూమ్లను తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం అందచేయాలని కలెక్టర్ గౌతమ్ సమావేశంలో అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేటాయింపులకు సంబంధించిన వివరాలను, పంపిణీ ప్రక్రియను అధికారులు జిల్లా కలెక్టర్ గౌతమ్కు వివరించారు. అలాగే రాజీవ్ గృహకల్ప ఇళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను తెలుసుకొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేయాలని... పనులను త్వరితగతిన పూర్తి చేసి ఏమాత్రం పెండింగ్ లేకుండా ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ గౌతమ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారం తప్పకుండా హాజరు కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులకు అందచేయనున్న డబుల్ బెడ్రూమ్లలో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ గౌతమ్ సూచించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు కేటాయింపులు జరిగిన అనంతరం లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగానే పూర్తి స్థాయిలో వసతులు కల్పించి వారికి అందచేయాల్సిన అవసరం ఉందని ఈ విషయంలో ఏఏ అవసరాలు ఉన్నాయో అధికారులు ప్రత్యక్షంగా డబుల్ బెడ్రూమ్ల వద్దకు వెళ్ళాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు డబుల్ బెడ్రూమ్ విషయాలపై పలు విషయాలను జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకురాగా అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేశ్కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎమ్సీ) అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని : తహసిల్దార్ వాణి రెడ్డి



శామీర్ పేట(గరుడ వార్త) : కేశవరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 33 34 35 లోని సుమారు 47 ఎకరాల భూమి సక్రమంగానే యాజమాన్య హక్కు బదిలీ జరిగిందని మూడు చింతలపల్లి మండల్ తహసిల్దార్ వాణి రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తాను మూడుచింతలపల్లి మండలానికి తహసిల్దార్ గా రాకా మునుపే, సదరు పిటి బూమి లంబాడి రాజి పేరు నుండి ఎంతో మంది ఇతరుల పేరు పైకి బదిలీ జరిగిందని ఆమె గుర్తు చేసారు. అందుకు సంబందించిన ఆధారాలు సైతం ప్రెస్ నోట్ ద్వార జతచేసి ఇచ్చారు. గురువారం మూడు చింతలపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మండల పరిధిలోని కేశవరం గ్రామంలోని సర్వే నంబరు 33, 34, 35 1950వ సంవత్సరం ప్రొటెక్టెడ్ టేనంట్ అధికారిక పట్టికలో ఉన్న దాని అనుసారం, సదరు నంబర్లకు చెందిన సుమారు 47 ఎకరాల భూములకు పట్టేదారుగా సయ్యద్ అమీర్ సాబ్ పేరు పై నమోదయ్యి ఉండగా, అనుభవదారుగా మాత్రం లంబాడి రాజి పేరు నమోదయ్యి ఉన్నట్లుగా తెలిపారు. కాగా కాలక్రమంలో సదరు సర్వే నంబర్ల లోని భూముల్లో ఇతరుల పేరు పైకి మారడం జరిగిందని తెలిపారు. అందుకు 2019-20వా సంవత్సరం పహానిలో నమోదైన పేర్లు స్పష్టత ఇస్తున్నాయని తెలిపారు. అయితే పిటి ల్యాండ్ అనుభవదారురాలైన రాజి వారసులు మోతితో పాటు మరో తొమ్మిది మంది మేడ్చల్ న్యాయస్థానం నుండి తామే రాజీకి వారసులమని కోర్టు నుండి లీగల్ హెయిర్ ఉత్తర్వులు పొందారని, తద్వారా తెలంగాణ టేనేన్ట్స్ అండ్ అగ్రికల్చరల్ ల్యాండ్ చట్టం ప్రకారం రాజీ బూములకు వీరు అర్హులని తెలుస్తుందని తెలిపారు. ఇక వారి వద్ద ఉన్న దస్తావేజులు పరిశీలించిన అనంతరం మహేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంఆర్ ఇంఫాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ సంస్థకు 26 ఎకరాల 25 గుంటల స్థలాన్ని పట్టాదారులుగా నమోదైన వారి నుండి 2022 సంవత్సరం మొదట్లోనే రిజిస్టర్ సేల్ డీడల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది అని తెలిపారు. ఇక డి రామ్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కూడా 8 ఎకరాల 37 గుంటల స్థలాన్ని సర్వే నంబరు 34 35 లో కొనుగోలు చేసినట్లుగా, అది కూడా 2001వ సంవత్సరంలోనే రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేసినట్లుగా తెలుస్తుందని తాసిల్దార్ వాణి రెడ్డి ప్రకటన ద్వార తెలిపారు. దీంతో అప్పడి శామీర్పేట తహసిల్దార్ స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు ముటేషన్ ప్రొసీడింగ్స్ సైతం అందజేసినట్లుగా తెలుస్తుందని తెలిపారు, కాగా మోతితో పాటు మరో ఎనిమిది మంది ఏపీ టేనేన్ట్స్ అగ్రికల్చరల్ ల్యాండ్ చట్టం కింద 2016 సంవత్సరంలో శామీర్పేట తాసిల్దార్ వద్ద తామే రాజి కి వారసులం అంటూ వారు దావా వేయడం జరిగిందని తెలిపారు. దాని అనుసారం తహసిల్దార్ షామీర్పేట్ అప్పట్లో సదరు స్థలాలైనా సర్వే నంబర్ 33 34 35 భూముల్లో పట్టాదారులుగా కొనసాగుతున్న వారందరికీ పలుమార్లు నోటీసులు అందివ్వడం జరిగిందని, అది 2016 నుండి 2020 సంవత్సరం వరకు కొనసాగిందని తెలిపారు. తరువాత తాసిల్దార్ కార్యాలయంలో దావా వేసిన వారే తర్వాత తామే విసిగి వేసారి పిటి ల్యాండ్లను పట్టాదారులుగా కొనసాగుతున్న కొందరు పేరు పైకి బదిలీ పై సమ్మతం తెలిపినట్టుగా తెలుస్తుందని తెలిపారు. అందుకు సంబంధించి సుమారు 19 ఎకరాల స్థలానికి అప్పటి షామీర్పేట తాసిల్దార్ ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారని తెలిపారు. ఇక ప్రొటెక్టెడ్ టేనెంట్ వారసుల అభీష్టం మేరకే మూడు చింతలపల్లి తహసీల్దార్ మండల కార్యాలయం నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేపట్టేందుకు చర్య తీసుకున్నారని తెలిపారు. కాగా సదరు అభ్యర్థనను ఇదే సంవత్సరంలోని 10 వ నెల మూడో తారీఖున చేపట్టినట్లుగా తెలిపారు. ఇందుకుగాను సదరు లీగల్ హెయిర్ వారి అఫీడవిట్లను స్వయంగా వచ్చి తహసిల్దార్ మూడు చింతలపల్లి మండల కార్యాలయంలో తన ఎదుట ఇచ్చారని మూడిచింతలపల్లి తాసిల్దార్ వాణిరెడ్డి తెలిపారు. వారిచ్చిన అఫిడవిట్లో వారు వేసారి పోయామని అంతేకాకుండా తమ పిటి భూములను సిఎంఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ కు చెందిన 26 ఎకరాల 25 గుంటల స్థలాన్నికిగాను, అదేవిధంగా స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన ఎన్ని ఎకరాల 37 గుంటల స్థలాన్ని వారి పేరు పైన కొనసాగేందుకు తమకు సమ్మతేమే అన్నట్లుగా తెలిపినట్లుగా తెలిపారని మూడుచింతలపల్లి తహసిల్దార్ వాణి రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్తోపాటుగా, ప్రెస్ నోట్ ద్వారా తెలియజేశారు. తానూ మూడుచింతలపల్లి తహసిల్దార్గా పదవి బాధ్యతలు చేపట్టక మునుపే లంబాడి రాజి పేరు నుండి ఇతరుల పేర్ల పైకి ఆస్తి హక్కు బదలాయింపు జరగిందని, అటువంటిది తానూ ఏదో చేసినట్లుగా వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు.

## మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

వర్గల్ : మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు ఉచితంగా అందించాలని లక్ష్యంతో, మేడ్చల్ లోని మెడిసిటి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. గురువారం వర్గల్ మండల్ తుంకి కల్సా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం గ్రామ సర్పంచ్ సంధ్య, మరో ప్రజా ప్రతినిధి జానీ ఆధ్వర్యంలో కొనసాగింది, సదరు వైద్య శిబిరంలో బిపి, షుగర్ పరీక్షలు తోపాటుగా కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన



సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు గ్రామస్తుల్లో ఉన్నాయో లేదో పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేసారు. ఇట్టి కార్యక్రమములో యం పి టీ సి జనార్దన్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శి ప్రశాంత్ , కారోబార్ నాగేష్ , గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో 106 మందికి షుగర్, బీపీ పరిక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 33 మందిని రిఫర్ చేయడం జరిగింది. వీరిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయనున్టుగా సమాచారం. ఈ వైద్య శిభిర కార్యక్రమంలో డాక్టర్లు నిశాత్, హర్షిని, రవితేజ, చేతన్, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, బాలకృష్ణ ,సత్యనారాయణ , సాత్విక పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధానోపాధ్యాయురాలికి వీడ్కోలు

శామీర్ పేట(గరుడ వార్త) : గత ఆరు సంవత్సరాలుగా దేవరయంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిహెచ్ఎంగా విధులు నిర్వహించి సాధారణ బదిలిలో భాగంగా దత్తాయిపల్లి యాదాద్రి భువనగరి జిల్లకు వెళ్తున్న సిహెచ్ స్వరూపరాణిని జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థిని. విధ్యార్థులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానిం చారు. గురువారం నూతనంగా జిహెచ్ఎంగా బాలేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బిమిడి జైపాల్ రెడ్డి, రామారావు, నర్సింహ్మారెడ్డి, రామాలయం గుడి పుజారి, పాఠశాల పూర్వ విద్యార్తులు, గోవింద రెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డిపై ఆరోపణలను సరైనవి కావు: మండల ప్రధాన కార్యదర్శి టీజీ అనిల్ రెడ్డి

శామీర్ పేట(టి.జి.ఎన్.ఆజాద్ తెలంగాణ) మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిపై మండలంలోని కేశవరం గ్రామంలో గిరిజనుల భూమి 47 ఎకరాల భూమి కబ్జా అని చేస్తున్న ఆరోపణంలో ఎలాంటి వాస్తవం లేవని గురువారం మూడుచింతలపల్లి మండల



బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.జి.అనిల్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మంత్రిగా ఉండి మండలానికి ఎంతో అభివృద్ధి చేశాడని వాటిని చూసి ఓర్వలేకనే మల్లారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు

శామీర్ పేట(గరుడ వార్త) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎస్జిఎఫ్ఇ ఆధ్వర్యంలో నాదర్గుల్ ని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జిల్లా హాకీ సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ క్రీడలలో పాల్గొన్న తుర్కపల్లి సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి స్టేట్ లెవెల్ కి చేరుకున్నారు. అండర్ 14 క్యాటగిరిలో టి సాహితీ,ఈ నిహారిక,



ఎం శ్రీవర్ధిన్, ఎ షివేంద్ర, ఎ దుర్గేష్, అండర్ 17 క్యాటగిరిలో అంజన శ్రీ, ఏ కీర్తన, బి వైష్ణవి, జి ప్రదీప్ రెడ్డి, వి మణిదీప్, జస్వంత్ విద్యార్థులు ఎంపిక అవ్వడం జరిగింది,గురువారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ ఎల్లు వరప్రసాద్ రెడ్డి, ఇన్చార్జ్ సౌజన్య, గ్రేస్, పీఈటి అన్వర్, మురళి, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించడం జరిగింది.

## సన్నాలకు డిమాండ్..!

భానుపురి : జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో సన్నరకం ధాన్యానికి అధిక ధర పలుకుతోంది. వానాకాలం పంట నూర్పిళ్లు దాదాపు పూర్తయ్యాయి. పంటలను మార్కెట్‌కు విక్రయానికి తీసుకురావడంతో ఖరీదుదారులు అధిక ధర చెల్లిస్తున్నారు. సన్నరకం వాటితో బియ్యానికి ఉపయోగిస్తుండటంతో వీటి ధర రోజురోజుకూ పెరిగిపోతోంది. సూర్యాపేట మార్కెట్ యార్డుకు జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి పంట విక్రయానికి వస్తున్నా రు. సన్నాలకు అధిక ధర పలుకుతుండటంతో రైతులు ఇక్కడికే తీసుకొస్తున్నారు.

పెరుగుదలకు కారణం ఇలా..

జిల్లాలో వానాకాలం వరి సాగు 4,37,000 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవడం, మూసీ, సాగర్, గోదావరి జలాల రాకతో నీటికి కొదవ లేదు. దీంతో రైతులు వరిసాగుపై దృష్టి సారించారు. కానీ ఈసారి సన్నాలు సాగు తక్కువగా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,37,000 ఎకరాల వరిసాగు చేయగా ఇందులో 1.5 లక్షల



ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. 2,87,000 ఎకరాల్లో దొడ్డు, ఇతర రకాలు సాగు చేపట్టారు. సన్నరకాల సాగు తగ్గిపోవడంతో వాటికి కొరత ఏర్పడింది. దీంతో మార్కెట్‌లో అధిక ధర పలుకుతోంది. సన్నరకాలైన జైశ్రీరాం క్వింటాకు గరిష్ఠ ధర రూ.3,424, హెచ్ఎంటీ రకం గరిష్ఠ ధర రూ.3,176 ధర పలుకుతోంది.

మిల్లులకు తరలింపు

మార్కెట్‌లో కమీషన్‌దారులు కొనుగోలు చేసిన సన్నరకాలను మిల్లులకు తలిస్తున్నారు. సూర్యాపేటలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిర్యాలగూడ, కోదాడ, ఇతర ప్రాంతాల్లోని మిల్లులకు రవాణా చేస్తున్నారు. వాటిని బియ్యంగా మార్చి నిల్వ చేస్తున్నారు. మరికొంతమంది మిల్లర్లు బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో సన్నరకం ధాన్యంతో పాటు బియ్యానికి కూడా అధిక ధర పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో హెచ్ఎంటీ బియ్యానికి క్వింటా రూ.5,400, బీపీటీ ధాన్యానికి రూ.5,200 నుంచి రూ.6,000 వరకు పలుకుతోంది.

## నూతన ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాల అప్పగింత

మిర్యాలగూడ : నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు శాసన సభ్యులకు ప్రభుత్వం 2018లో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాలు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు అప్పగించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2018లో శాసన సభ్యుల కోసం వీటిని ఆయా నియోజకవర్గాల్లో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల్లో నిర్మించేందుకు నిధులు సమకూర్చినప్పటికీ ఒక్క నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మినహా 11 చోట్ల నిర్మాణాలు చేపట్టారు. నాగార్జునసాగర్‌లో స్థలం ఎంపిక విషయంలో స్పష్టత లేకపోవటంతో నిర్మాణం ప్రారంభించలేదు. కొద్దిరోజుల క్రితం నిడమనూరు మండల



కేంద్రంలో స్థలం ఎంపిక చేశారు. తాజాగా కుందూరు జయవీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా నియోజకవర్గ ప్రజలకు అందరికీ దగ్గరగా ఉండేలా దీన్ని హాలియాకు మారుస్తారనే చర్చ వినపడుతోంది. 11 నియోజకవర్గాల్లో ఓడిన ఎమ్మెల్యేలంతా క్యాంపు కార్యాలయ భవనాలను ఖాళీ చేశారు. సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను స్వాధీనం చేసుకున్న ఆర్అండ్‌బీ అధికారులు నూతనంగా ప్రమాణం స్వీకారం చేసిన ఎమ్మెల్యేలకు అప్పగించనున్నారు. మరో వారం రోజుల్లో క్యాంపు కార్యాలయాల్లోకి నూతన ఎమ్మెల్యేలు చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

## పశు సంవర్ధకశాఖలో ఏం జరుగుతోంది?

హైదరాబాద్: పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పత్రాల మాయం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా పోలీసుల విచారణకు సహకరించట్లేదని విశ్వసనీయ సమాచారం. మాసబ్‌ట్యాంక్ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోకి ప్రవేశించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఓఎస్డీ కల్యాణ్‌కు మార్ అక్కడ సీసీటీవీ కెమెరాలను తొలగించి, కీలక పత్రాలు ఎత్తుకెళ్లటంపై నాంపల్లి ఠాణాలో వాచ్‌మెన్ ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదైంది. తాను ఉన్నతాధికారుల అనుమతితోనే కార్యాలయంలోకి ప్రవేశించానంటూ ప్రధాన నిందితుడు కల్యాణ్‌కుమార్ వివరణ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రవీంద్రభారతిలో ఫర్నిచర్ తరలింపు, హిమాయత్ నగర్‌లోని పర్యాటక అభివృద్ధి కార్యాలయంలో అగ్నిప్రమాదం అనంతరం పశుసంవర్ధక శాఖలో పత్రాల మాయం వంటి వరుస ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మధ్యమండలం డీసీపీ శ్రీనివాస్ కార్యాలయాలను పరిశీలించి వివరాలు, పదుల సంఖ్యలో సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు సేకరించారు. పశుసంవర్ధక శాఖలో మాయమైన పత్రాలు ఎవరు తీసుకెళ్లారు? ఆ దస్త్రాల్లో ఎటువంటి వివరాలున్నాయి? ఓఎస్డీ కల్యాణ్‌కు అనుమతిచ్చిన అధికారి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసులు ఫోన్ చేసినా స్పందించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. వాస్తవాలు వెల్లడించాల్సిన పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ పోలీసుల విచారణకు సహకరించకుండా ముఖం చాటేస్తున్నట్టు తెలిసింది. రెండ్రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్టు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే రాజధానిలో చోటుచేసుకున్న వరుస ఘటనలను పోలీసులు తీవ్రంగా పరిగణించి, కేసులకు సంబంధించి పలు కీలక ఆధారాలు సేకరించారు.

## ఉజ్వల గ్యాస్ లబ్ధిదారుల వేలిముద్రల నమోదు




మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్ వినియోగదారుల్లో మృతులు, అనర్హుల పేర్లను ఏరివేసేందుకు లబ్ధిదారుల వేలిముద్రలను నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల రాయితీని భరించి పూర్తి ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను నిరుపేద కుటుంబాల మహిళలకు 2016 నుంచి అందజేస్తోంది. వాటిని పొందిన లబ్ధిదారులకు ప్రతినెలా ప్రత్యేకించి రూ.300 వరకు గ్యాస్ సిలిండర్లపై రాయితీని సైతం వారి ఖాతాల్లో నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మృతులు, అనర్హుల పేర్లను ఏరివేసి మరికొందరు అర్హులకు అందించాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు కలిగిన మహిళల వేలిముద్రలను సేకరించాలని ఈ నెల మొదటి వారంలో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలుగా ఉజ్వల గ్యాస్ నూతన కనెక్షన్ల పంపిణీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. నూతనంగా అర్హులు దరఖాస్తు చేసుకుంటే వారికి ఉజ్వల కనెక్షన్లు సైతం అందజేయాలని ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా వేలిముద్రలు నమోదు చేయాలని ఆదేశించింది. ఉజ్వల లబ్ధిదారులు గ్యాస్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత గ్యాస్ ఏజెన్సీల్లో వేలిముద్రలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అసత్య ప్రచారంతో గందరగోళం

గ్యాస్ సిలిండర్ రూ.500కు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో రూ.500కే సిలిండర్ ఇస్తారని.. ఇందుకు ఈకేవైసీ తప్పనిసరి అని తప్పుడు ప్రచారం జరుగుతోంది. దీంతో కొద్ది రోజులుగా కనెక్షన్‌దారులు పెద్ద సంఖ్యలో గ్యాస్ ఏజెన్సీలకు తరలి వస్తున్నారు. గంటల తరబడి వరుసలో నిల్చుంటున్నారు. ఇదే అదునుగా వారి నుంచి గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఈకేవైసీ ఉచితంగా చేయాలి. పైగా దీనికి ఎలాంటి గడువు లేదని ఆయా గ్యాస్ కంపెనీలు పేర్కొంటున్నా ప్రజలు వినిపించుకోవడం లేదు. గ్యాస్ కనెక్షన్‌దారు వేలిముద్రలు అవి రాకుంటే ఐరిస్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేస్తున్నారు.

రూ.500 సిలిండర్‌కు, ఈకేవైసీకి సంబంధం లేదు: వెంకటేశ్వర్లు, డీఎస్ఓ, నల్గొండగ్యాస్ కనెక్షన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. ఆయా గ్యాస్ కంపెనీలు మాత్రమే నిర్ణయించాయి. ఈకేవైసీ ఉంటేనే రూ.500 రాయితీ గ్యాస్ సిలిండర్ ఇస్తారనే ప్రచారం నమ్మొద్దు. ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీలో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

## శ్రీరాంసాగర్ జలాలపైనే ఆశలు



మోతె : రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భజలాలతో ఆయకట్టేతర ప్రాంతంలో అన్నదాతకు యాసంగి పంటల సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. వర్షాభావంతో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద జలాశయంలో నీళ్లులేక వానాకాలం పంట అరకొరే సాగైంది. దీంతో ఇక్కడ యాసంగిపై ఆశలు సన్నగిల్లి నానాటికీ తీసికట్టుగా మారుతున్న నేపథ్యంలో ఆయకట్టేతర ప్రాంతాల్లోనూ యాసంగి సాగుపై పెట్టుకున్న ఆశలు ముందుకు సాగేలా కనిపించడం లేదు. అయినా ఆశతో ఆయకట్టేతర ప్రాంతంలో చెరువులు, బోర్లు, బావుల కింద ఇప్పటికే నార్లుపోసి వరి పొలాల్లో సాగుకు రైతులు సమాయాత్తమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్ జలాలు యాసంగి సీజన్‌కు ఆశాదీపంగా మారనున్నాయి. ఒకింత ఊరట నానాటికి అడుగంటుతున్న భూగర్భజలాల పెంపునకు యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ కాల్వల్లో గోదావరి జలాలు పారిస్తే కర్షకులకు ఒకింత ఊరట కలగనుంది. ఏటా యాసంగి సీజన్‌లో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు ఎస్సారెస్పీ జలాలు సమృద్ధిగానే పారుతున్నా చివరి ఆయకట్టున ఉన్న కోదాడ నియోజకవర్గంలోని మోతె, మునగాల, నడిగూడెం మండలాలకు ఎప్పుడూ అరకొరగానే అందుతున్నాయి. ఈసారి ఇలా అరకొరగా వచ్చినా ఇక్కడ పూర్తిస్థాయిలో పంటల సాగుకు వనరులైన చెరువుల్లో జల నిల్వలు, బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరిగి యాసంగి పంట బయటపడేందుకు ఉపకరిస్తాయని ఇక్కడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ 71 డీబీఎం ప్రధాన కాల్వ పరిధిలో ఉన్న ఈ మూడు నియోజకవర్గాల్లోని మైనరు, పిల్ల కాల్వలు పూసిపారితేప్రాంతాలు ఆయకట్టును తలదన్ననున్నాయి. ముమ్మరంగా వరి నాట్లు ప్రధాన కాల్వ పరిధిలోని 36ఎల్, 22ఎల్ కాల్వల ద్వారా నియోజకవర్గంలోని మోతె, మునగాల, నడిగూడెం మండలాల్లో పరోక్షంగా సుమారు 36వేల ఎకరాల్లో సాగు కళకళలాడనుందనే అభిప్రాయాన్ని ఆయా ప్రాంతాల రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి జిల్లాతో పాటు కోదాడ నియోజకవర్గానికి అతి సన్నిహితుడు కావడంతో ఈసారి సాగునీటి కరవు తీరుతుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. బయ్యన్నవాగు జలాశయంలో ప్రస్తుతం 0.48 టీఎంసీ నీటినిల్వ లభ్యత ఉంది. ప్రభుత్వం ఆదేశాలిచ్చి 71 డీబీఎం కాల్వకు నీటిని విడుదల చేస్తే యాసంగికి మోక్షం లభించనుంది.

ఈ నియోజకవర్గాలకు ప్రస్తుత ప్రభుత్వం యాసంగి సీజన్‌కు శ్రీరాంసాగర్ ద్వారా సాగునీటి విడుదలపై తేల్చకున్నా రైతులు ఇప్పటికే ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఇది చేతికి అందాలంటే శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వల ద్వారా వారబందీ పద్ధతిలో గోదావరి జలాలను అందించాలని రైతులు కోరుతున్నారు. కాల్వల్లో నీటి విడుదల విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు అందలేదని ఎస్సారెస్పీ ఏఈ లింగయ్య తెలిపారు. ఆదేశాలొస్తే ప్రణాళిక ప్రకారం వారబందీ పద్ధతిలో కాల్వలకు నీటి విడుదల జరుగుతుందన్నారు.

## కాపాడుకుందాం.. మన ఆరోగ్యం..!

మిర్యాలగూడ : ప్రపంచంలో కనీసం సగం మందికి పైగా సరైన ఆరోగ్య సేవలు అందక ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఆరోగ్యం కోసం వైద్య చికిత్సలకు విపరీతంగా ఖర్చులవటంతో అనేక మంది పేదరికంలోకి దిగజారుతున్నారు. దీనిని అధిగమించి 2030 నాటికి ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలోని సభ్య దేశాలు 2012 డిసెంబరు 12 ఒక తీర్మాణాన్ని ఆమోదించాయి. అప్పటి నుంచి యేటా డిసెంబరు 12న 'ప్రపంచ ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ రోజున ఏటా ప్రత్యేక థీమ్‌ను అనుసరిస్తున్న ప్రపంచ దేశాలు.. ఈ ఏడాది 'హెల్త్ ఫర్ ఆల్.. టైమ్ ఫర్ యాక్షన్' థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మానసిక వేదనతో కుంగుబాటు

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలకు నేటికీ సరైన ఆరోగ్య సేవలు అందకపోవడంతో చాలా మంది మృత్యువాత పడుతున్నారు. యేటా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాణాంతక క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు రోడ్డు ప్రమాదాల ద్వారా అనేక మంది కోలుకోలేని విధంగా కుంగిపోతున్నారు. ఇటువంటి వారు అటు ఆర్థికంగానూ.. ఇటు ఆరోగ్య పరంగానూ క్షీణించి మానసిక వేదన అనుభవిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలు అంతంతే

పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన పలు పథకాలు ఉమ్మడి జిల్లా ప్రజలకు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా వైద్య సేవలు అందించేందుకు పలు ప్రైవేట్ ఆసుపత్రులు నిరాకరించడమే దీనికి ప్రధాన కారణం.



ఇటీవలే నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవల పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.3లక్షల వరకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

జిల్లాలో మెరుగైన సేవలు అవసరం

దీర్ఘ కాలిక రోగాలు, ఇతర వ్యాధులకు ఆధునిక చికిత్స కోసం చాలా మంది మహా నగరాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు జిల్లా కేంద్రాల్లోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. క్షేత్ర స్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలి. కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం తట్టుకునేలా క్షేత్ర స్థాయిలోని ఆసుపత్రులను ఆధునీకీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

కరీంనగర్ : నిర్ణీత వ్యవధి ప్రకారం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ దిశగా అవసరమైన ఏర్పాట్లలో యంత్రాంగం తీరిక లేకుండా ఉంటోంది. కొత్తగా కొలువు దీరిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో జరిగే ముఖ్యమైన ఎన్నికలకు పచ్చజెండా ఊపినా తాము సిద్ధమనే రీతిలో ఉమ్మడి జిల్లాలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరిగ్గా అయిదేళ్ల కిందట అనుసరించిన విధివిధానాలపై దృష్టి సారిస్తూనే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవసరమైన ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. ఆయా పంచాయతీల వారీగా గతంలో అనుసరించిన రిజర్వేషన్ల వివరాల్ని ఇదివరకే మండలాల వారీగా పంపించారు. ఈ సారి అందుబాటులో ఉన్న ఓటరు జాబితాను సరిచేసే పనిలో సిబ్బంది ఉన్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో పంచాయతీల వారీగా ఓటర్లలో చాలా మంది మరణించిన వారివి తొలగించలేదు. పైగా కొన్ని చోట్ల కొత్తగా ఓటర్లు చేరాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తుది జాబితాను సిద్ధం చేసే వీలుంది. త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో ఓటరు జాబితా మార్పులు చేర్పులకు అవకాశం ఉండే వీలుంది. వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఉండటంతో పక్కాగా నవీకరణ చేపట్టే అవకాముందనే చర్చ జరుగుతోంది.

నాయకుల ఆసక్తి : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటవగానే స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలు కావడంతో నాలుగు జిల్లాల్లోని పార్టీల నాయకులు ప్రత్యేకంగా దృష్టిని సారిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో కీలకమైన పదవులపై కన్నేసిన వారంతా తమ ప్రయత్నాల్లో ఉంటున్నారు. ఇప్పటికే ఈ తరుణం కోసం ఎదురుచూసిన ఆశావహ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న నాయకులతో తమ ఆంకాక్షలను వెల్లడిస్తున్నారు. పార్టీల గుర్తులపై ఈ ఎన్నికలు జరగకున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆయా పార్టీల నాయకులు తమ ముఖ్య నేతల అండదండల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో పడిన కష్టానికి గుర్తింపుగా అవకాశమివ్వాలని విన్నవించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రభావం స్థానిక సంస్థలై కూడా పడుతుందనే వాదన వినిపిస్తోంది. ఇదే సమయంలో పార్టీలకతీతంగా జరిగే ఎన్నికలవడంతో ఒకింత వ్యక్తి ప్రాబల్యానికే ఓటర్లు పెద్ద పీట వేస్తారనే ఉద్దేశంతో పలువురు ఈ సారి రంగంలో నిలవాల్సిందేనని నిర్ణయించుకుంటున్నారు. ప్రధాన పార్టీల తరఫున అందరు గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెడుతున్నారు. తరువాత మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికలతోపాటు పుర, నగరపాలికల్లో జరిగే వాటి కోసం మానసికంగా సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాదంతా వరుస ఎన్నికల జాతర నాలుగు జిల్లాల్లో కనిపించబోతోంది.

ఎన్ని విడతలుగా..?

పెరిగిన మండలాల ఆధారంగా ఈసారి కూడా గత ఎన్నికల మాదిరిగానే మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఇందుకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారుల కార్యాలయంలో సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ సారి వార్డుల సంఖ్య పెరిగే అవకాశం లేకపోవడంతో గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను మరోసారి పరిశీలిస్తున్నారు. 1,210 గ్రామపంచాయతీలు ఉండటంతో రెండు విడతలుగా అనేది కష్టసాధ్యమైన ప్రక్రియ. పైగా పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచాల్సి రావడం.. సిబ్బంది సంఖ్య గతానికన్నా ఎక్కువగా అవసరమవడంతో ఈసారి ఏర్పాట్లపై ఏ జిల్లాకు ఆ జిల్లాలో అవసరమైన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల కిందటి నుంచి జిల్లాలోని అన్ని విభాగాల్లో ఉన్న సిబ్బంది వివరాల్ని సేకరించారు.

## పంటల బీమా పట్టాలెక్కేనా..?

జగిత్యాల : ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాల వర్షాలకు దెబ్బతిని నష్టపోయినా పంటల బీమా అమలు లేక నష్టపరిహారం అందడం లేదు.. ప్రభుత్వపరంగా గతంలో సాయం అందేది. అదీ కొన్నేళ్లుగా రావడం లేదు. గత మార్చిలో అకాల వర్షాలకు వడగళ్ల వానలు పంటలు తీవ్ర నష్టపోయిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ప్రకటించినా అది అందరికీ అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.. పంటల అమలు చేసి తమకు ఈ ఇబ్బందులు తప్పించాలని కోరుతున్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా రాష్ట్రంలో మూడేళ్లుగా అమలు చేయడం లేదు. ప్రస్తుత యాసంగికి నవంబరు 1 నుంచి డిసెంబరు 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉన్నా ఇప్పటికీ ప్రకటించలేదు. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో మన జిల్లాలో 9 పంటలకు బీమాను అమలు చేసేవారు. ఫసల్ బీమా ద్వారా వరి, మక్క, వేరుసెనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా ఉండేది. కానీ ఇటీవల కొన్ని సీజన్లుగా బీమా అమలు లేకపోవటంతో వానాకాలం, యాసంగిలో సంభవించే ప్రకృతి విపత్తుల పంట నష్టానికి రైతులకు ఆసరా లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెలువరిస్తేనే రైతులు ప్రీమియం చెల్లించే వీలుంటుంది కాబట్టి నూతన ప్రభుత్వంలో అమలుపై అన్నదాతలు ఆశగా ఉన్నారు.

గతంలోనూ అంతంతే : 2000 సంవత్సరంలో ప్రవేశపెట్టిన పంటల బీమాను 31 సీజన్లలో అమలు చేయగా రైతులు సగం కిస్తీని చెల్లిస్తే మిగిలిన సగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీకి చెల్లించేవి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మొత్తం 9.13 లక్షల మంది రైతులు రూ.62.12 కోట్ల బీమా ప్రీమియం చెల్లిస్తే ఇంతే సమానంగా ప్రభుత్వం చెల్లించింది. అయినా కూడా 3.72 లక్షల మంది రైతులకు రూ.92 కోట్ల పరిహారం మాత్రమే వచ్చింది. మామిడిలో వాతావరణ బీమాను అమలు చేసినా కనీసం రైతులు చెల్లించిన ప్రీమియం మేరకు కూడా పరిహారం రాలేదు. ఈ నేపథ్యంలో జిల్లా, మండలం యూనిట్‌గా కాకుండా రైతువారీగా లేదా కమతం, సర్వే నంబర్ల వారీగా బీమాను అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కానీ బీమాలో మార్పులకు బదులు మూడేళ్ల క్రితం కిస్తీ చెల్లింపు ఇష్టం రైతులకే వదిలేసి అమలు బాధ్యతను కంపెనీలకు అప్పగించారు. పైగా తాము చెల్లించాల్సిన కిస్తీపై ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించకపోవడంతో రైతుల్లో నమ్మకం సడలి బీమా వైపు వెళ్లటం లేదు.

బీమా ఉంటే ప్రయోజనం : భారీ వర్షాలు, వరదలు, రాళ్ల వానలు, ఇతరత్రా చీడపీడల తీవ్రత తదితర ప్రకృతి విపత్తుల నష్టానికి బీమాతో తగిన పరిహారం వచ్చే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు నిరుడు యాసంగిలో ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 47 వేల ఎకరాల్లో వడగళ్లతో పంటలు దెబ్బతినగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందరికీ అందలేదు. బీమా అమల్లేక దాదాపుగా రూ.50 కోట్లవరకు పరిహారం అందే వీల్లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందారు. గత వానాకాలంలోనూ వరదలతో పెద్దఎత్తున పంటలు కొట్టుకుపోయినా బీమాను అమలు చేయలేదు, ప్రభుత్వం కూడా పంట నష్టం పరిహారానికి పరిగణనలోకి తీసుకోక రైతులు రెండు రకాలుగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో మార్పులు చేసిన బీమాను అమలు చేస్తే మామిడి వంటి పంటల్లో నష్టపోయిన సందర్భాల్లో ఎకరాకు కనీసం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు పరిహారం వచ్చే వీలుంటుంది. ఇదే తరుణంలో బీమా కిస్తీ చెల్లించిన రైతులు, వారి కుటుంబసభ్యులకు రూ.2 లక్షల ప్రమాదబీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితరాలకు పరిహారం కూడా అందుతుంది. కొత్త ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకోవాలని పంటల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఆర్టీఏలో అక్రమాలపై నజర్

హైదరాబాద్: గ్రేటర్‌లోని రవాణాశాఖలో ప్రక్షాళన ప్రారంభం కానుంది. పదేళ్లుగా కీలక స్థానాల్లో చక్రం తిప్పుతున్న కొందరి అధికారులపై చర్యలు తప్పవని తెలుస్తోంది. ఇప్పటికే కొందరి అధికారుల తీరుపై పెద్దల దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని పలు కార్యాలయాల్లో బాధ్యతలు నిర్వర్తించాల్సిన కొందరు సిబ్బంది కొందరు అధికారుల అండదండలతో డిప్యుటేషన్‌పై చెక్‌పోస్టుల పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేసుకొని అక్కడే తిష్ఠ వేశారు. అక్కడ నుంచి పెద్దఎత్తున లభించే మామూళ్ల కోసం అడ్డదారుల్లో పోస్టింగ్‌లు దక్కించుకుని కొనసాగుతున్నారు. ముఖ్యంగా ఓ కీలకాధికారి అండదండలతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. గ్రేటర్‌లోని పలు కార్యాలయాల్లో విధులు నిర్వహించాల్సిన ఎంవీఐలు, ఏఎంవీఐలు ఆయా చెక్ పోస్టుల వద్ద కొనసాగుతూ కోట్లకు పడగలెత్తుతున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అధికారులు బదిలీ చేసినా ఇటు రారు. ఒకవేళ వచ్చినా ఒకటి, రెండు నెలలు పనిచేసి మళ్లీ పైరవీలతో చెక్‌పోస్టులకు



చేరుతున్నారు.

ఎక్కువ మంది అక్కడే..

రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి, అలంపూర్, కల్లూరు, కోదాడ, జహీరాబాద్ తదితర 12 చెక్‌పోస్టుల్లో గ్రేటర్ అధికారులే ఎక్కువ శాతం మంది ఉంటారు. అందుకు ఉన్నతాధికారులు చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా చెక్‌పోస్టుల్లో పోస్టింగ్ కోసం ముందే భారీగా చెల్లింపులతోపాటు నెలావారీ కమీషన్లు తప్పనిసరిగా సమర్పించుకోవాల్సిందే. పైనుంచి అండదండలు ఉండటంతో చెక్‌పోస్టుల వద్ద తిష్ఠ వేసిన ఈ అధికారుల జోలికి వెళ్లాలంటే వీరిపై అధికారులు జంకే పరిస్థితి ఉంది. తాజాగా ప్రభుత్వం మారడంతో ఈ అక్రమాలపై పలువురు ఆర్టీఏ సిబ్బంది ఫిర్యాదులు చేస్తున్నారు. త్వరలో రవాణా శాఖపై ఉన్నతస్థాయిలో సమీక్ష ఉండటంతో ఇలాంటి అధికారులపై వేటు తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. అంతేకాకుండా వేగ నియంత్రణ పరికరాలు (స్పీడ్ గవర్నర్‌లు) తప్పనిసరిగా అమర్చుకోవాలని గతంలో కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. రవాణా వాహనాలు గంటకు 60 కిలోమీటర్లకంటే వేగం వెళ్లకుండా వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆటోలతోపాటు అన్ని రవాణా వాహనాలకు తప్పనిసరి చేశారు. ఇతర రాష్ట్రాల్లో స్పీడ్‌గవర్నర్లు రూ. 3-4 వేలుంటే కొందరు అధికారులు, గుత్తేదారులతో కుమ్మక్కై రెండింతల ధరలకు వాహనదారులకు అంటగట్టారనే విమర్శలున్నాయి. అందుకు రూ. కోట్లు చేతులు మారాయి. వీటిపై ఎలాంటి విచారణ కూడా సాగలేదు. వీటన్నింటిపై తీగ లాగనున్నట్లు తెలుస్తోంది.

# కాప్రాలో ప్రభుత్వ స్థలానికి రెక్కలు!

కాప్రా : కాప్రా మండల పరిధిలోని 199 సర్వే నంబరులో ప్రభుత్వ భూములకు రెక్కలొచ్చాయి. పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రూ. కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమౌతున్నాయి. జమ్మిగడ్డలోని ఈ సర్వే నంబరులో ప్రభుత్వం 2000 సంవత్సరంలో స్టేడియం కోసం 10.30 ఎకరాలను, శ్మశాన వాటిక కోసం 1.18 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండున్నర దశాబ్దాలుగా ఈ స్థలం తమదంటే తమదంటూ ప్రైవేటు వ్యక్తులు, రెవెన్యూ శాఖ మధ్య వివాదం కొనసాగింది. చివరికి ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టులో తీర్పు వచ్చింది. ఇటీవల కబ్జాదారుల కన్ను ఈ స్థలంపై పడింది. అధికారులు శాసనసభ ఎన్నికల పనుల్లో ఉండటాన్ని ఆసరాగా తీసుకుని స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ కట్టడాలకు తెరలేపారు. రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. మందీ మార్బలంతో రాత్రికి రాత్రే పనులు మొదలుపెట్టి తెల్లవారే సరికి గదులను నిర్మించి రంగులు వేసేస్తున్నారు. ఆ గదుల్లోకి సామాన్లతో సహావచ్చి నివాసం ఉంటున్నారు.



పాతికకుపైగా వెలిశాయి... ఎన్నికల ప్రక్రియ పూర్తయి అధికారులు ఊపిరి పీల్చుకునేలోపే పాతికకుపైగా నిర్మాణాలు వెలిశాయి. అధికారులకు ఫిర్యాదు అందినా పట్టీపట్టనట్లు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాదారులు, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం కూడా కలెక్టర్, ఆర్డీఓ తహసీల్దార్, పోలీసు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం-తహసీల్దార్, కాప్రా

ఫిర్యాదులందడంతో అక్రమ నిర్మాణాలను పరిశీలించాం. ప్రభుత్వ స్థలంలో ఉండటం వాస్తవమేనని గుర్తించాం. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఎక్కువ ఆదాయ రూట్లపైనే దృష్టి

తాండూరు :జిల్లాలో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, వృత్తి, కూలీపనిచేసుకునే వారు నిత్యం మహా నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. వీటితోపాటు ఆయా మున్సిపాలిటీల్లో పట్టణ ప్రాంతాలకు రాకపోకలు ఉంటాయి. ఆదాయం వస్తుంది కాబట్టి వీటిపైనే అధికారులు దృష్టి పెడుతున్నారు తప్ప పల్లెలపై దృష్టి సారించడంలేదని విమర్శలొస్తున్నాయి. పెరిగిన ప్రజావసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచాలని ప్రయాణికులు కోరుతున్నా అధికారుల స్పందన నామమాత్రంగానే ఉంటోందనే విమర్శలున్నాయి.

కొన్ని ఉదాహరణలు..

మూడు డిపోల పరిధిలో దాదాపు 44 గ్రామాలకుపైగా బస్సులు తిరగడం లేదు. పరిగి మండలంలోని లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్, నర్సయ్యగూడ, బర్కత్‌పల్లి తదితర పంచాయతీలు ఎర్ర బస్సుకు నోచుకోలేదు.

పోల్కంపల్లి, రావులపల్లి గ్రామాలకు లఖ్నాపూర్, సయ్యద్‌పల్లి గ్రామాలకు పాఠశాల సమయాల్లోనే నడుస్తున్నాయి.

యాలాల మండలంలోని రేళ్లగడ్డతండా, అడాల్‌పూర్, సంగాయిపల్లి, పెద్దేముల్ మండలం జయరాంతండా, చైతన్యనగర్, ధరున్‌వాగుతండా, వికారాబాద్ మండలంలోని పులుమద్ది, దుర్గంచెరువు, సిద్ధులూరు గ్రామాలకు కూడా బస్సు సదుపాయం లేదు.

ఒకే రోజు 73వేల మంది ప్రయాణం

మహాలక్ష్మి పథకం ప్రారంభం తొలిరోజున మూడు డిపోల పరిధిలో 19,777 మంది మహిళలు ప్రయాణించగా ఆదివారం ఒకే రోజు 72,996 మంది ఉచితంగా ప్రయాణించారు. వికారాబాద్ డిపో మొదటి స్థానం, తాండూరు ద్వితీయ, పరిగి డిపో చివరన ఉంది.

పలుమార్లు అధికారులకు విన్నవించాం- ఎన్.రేణుక, సర్పంచి, లక్ష్మీదేవిపల్లి

మా గ్రామానికి బస్సు నడపాలని పలుమార్లు గతంలో అధికారులను కోరాం. చూస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. కనీసం ఈసారైనా నడిపితే మహాలక్ష్మి కింద పేదలకు మేలు జరుగుతుంది.

అందరికీ వర్తించేలా చూస్తాం- ఎ.శ్రీధర్, ప్రాంతీయ మేనేజర్, రంగారెడ్డి రీజియన్

బస్సుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మహాలక్ష్మి అందరికీ వర్తించేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తాం. త్వరలోనే డిపోల వారీగా సమీక్షించి అవకాశాలను పరిశీలించి బస్సులు నడుపుతాం.

# కాలుష్యకారక పరిశ్రమలపై కొరడా



హైదరాబాద్: అనుమతుల్లేకుండా కార్యకలాపాలు సాగిస్తున్న పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి కొరడా ఝుళిపిస్తోంది. 'కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్', 'కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్' అనుమతులు తీసుకోని పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేస్తోంది. పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు నిర్వహిస్తోంది. నిబంధనల మేరకు నడుచుకోని వారిపై జరిమానాలు విధిస్తోంది. ఏడాదిలో 83 సంస్థల మూసివేతకు ఆదేశాలిచ్చింది.

తనిఖీల్లో వెల్లడి కావడంతో.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన ఐఎంఆర్ ఆగ్రోవెట్ కోళ్ల దాణా సంస్థ మూసివేతకు పీసీబీ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమ చుట్టుపక్కల దుర్వాసన, కాలుష్యం పెరగడంతో మండలానికి చెందిన వైస్ఎంపీపీ ఫిర్యాదుతో ఈ చర్యలు తీసుకుంది. 2022 నవంబరు 21న ఈ సంస్థ కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ అనుమతులు తీసుకోగా.. 2027 అక్టోబరు వరకు నిర్వహణ అనుమతులు పొందింది. అయితే కాలుష్య కట్టడిలో విఫలమవడంతో తనిఖీలు చేసిన అధికారులు నిర్వహణ లోపాలను వెల్లడించారు. విడుదలయ్యే వ్యర్థజలాల్లో కాలుష్య ఉద్గారాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బొగ్గుకు బదులుగా కట్టెలను ఇంధనంగా వాడటంపై పీసీబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దుర్వాసన, ఇతర వాయువుల కట్టడికి స్క్రబ్బర్ ద్వారా బయోఫిల్టర్లకు పంపాలి, అలాంటి చర్యలు తీసుకోలేదు. ఫిల్టర్లను ఏర్పాటు చేసినా నిర్వహణ రిజిస్టర్‌లో ఆ వివరాలను నమోదు చేయడం లేదని గుర్తించారు. ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేయకపోవడంతో గాఢత ఉన్నవాయువులు నేరుగా గాలిలో కలిసి చుట్టుపక్కల వారు ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడింది. దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేసి అనంతరం రూ. 6లక్షల జరిమానాతో పాటు వాయు, జల చట్టం ప్రకారం... సంస్థను మూసివేయాలని ఆదేశించారు.

అనుమతులు లేకుండా బల్క్ డ్రగ్ ఉత్పత్తులు తయారు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా రెండు కేఎల్ సామర్థ్యంతో రియాక్టర్ల ఏర్పాటు, సింగిల్ స్టేజ్ స్క్రబ్బర్‌ల వినియోగంతో కాలుష్య ఉద్గారాలు పెరగడంతో మేడ్చల్‌కు చెందిన కొఠారు ల్యాబొరేటరీస్‌పై పీసీబీ చర్యలు తీసుకుంది. మూసివేతకు ఆదేశాలిచ్చింది. ఆ సంస్థ కొన్ని నెలల్లోనే నిబంధనల ప్రకారం కాలుష్య నియంత్రణకు బాయిలర్లు, స్క్రబ్బర్లను ఏర్పాటు చేసింది. దీంతో తిరిగి కార్యకలాపాల నిర్వహణకు అధికారులు ఆమోదం తెలిపారు.

# ప్రమాదాల నియంత్రణకు రహదారి భద్రత గణన



హైదరాబాద్: రహదారులపై ప్రమాదాలను నియంత్రించేందుకు 'రహదారి భద్రత ఆడిట్' నిర్వహిస్తే ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లోని పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృందం సూచించింది. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక విడుదలైన సందర్భంగా పరిశోధక బృందం పలు సూచనలు చేసింది. రహదారి భద్రత ఆడిట్ ఇప్పటి నుంచే చేపడితే ఐదేళ్లలో ప్రమాదాలను 20-30 శాతం వరకూ తగ్గించవచ్చంది. ఈ ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? అనే అంశాలు తెలుస్తాయంది. రహదారులపై ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను ఓయూ పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ ఎం.కుమార్ వెల్లడించారు.

నిర్మాణం, రాకపోకలపై సమగ్ర సమాచారం

రహదారులపై ప్రమాదాలు తగ్గించేందుకు నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం సిద్ధం చేసుకున్నాకే రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రొఫెసర్ ఎం.కుమార్ తెలిపారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, రాష్ట్ర రహదారులు నిర్మిస్తున్నప్పటికీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని రహదారుల నిర్మాణంలో ఉపయోగించాలని వివరించారు. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారులపై అంచనాకంటే ఎక్కువ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయని దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. హైదరాబాద్-విజయవాడ మధ్య 300 కిలోమీటర్ల దూరంలో ఏయే పట్టణాలు, గ్రామాల్లో వాహనాల సాంద్రత ఎక్కువగా ఉంది? వచ్చే 20 ఏళ్లలో పెరగనున్న జనాభా, వాహనాల వివరాలను అంచనా వేయడం ద్వారా వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునే వీలుంటుందని వివరించారు.

ఆడిట్‌లో అన్ని వివరాలు

జాతీయ, రాష్ట్ర రహదారుల ప్రమాదాలపై ఓయూ బృందం అధ్యయనం చేసింది. కొన్నినెలల క్రితం హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారులు, హైదరాబాద్‌లోని రహదారులు, ఓఆర్‌ఆర్‌పై నమోదైన ప్రమాదాలను విశ్లేషించింది.

రహదారుల నిర్వహణ లోపాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం రేడియం బోర్డులు కూడా లేవని తేల్చింది. హైదరాబాద్-విజయవాడ రహదారిపై రాత్రివేళ ట్రక్కులు, లారీలను డ్రైవర్లు రహదారిపైనే నిలిపివేయడంతో కార్ల డ్రైవర్లలో కొందరు వాటిని గమనించకుండా ఢీకొడుతున్నారు.

# ప్రగతి రథం.. పల్లెకు చేరితేనే ఫలం

తాండూరు : రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాలక్ష్మి' కానుక కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. దీనికి మహిళల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది. రద్దీ పెరుగుతోంది. ఇదే సమయంలో బస్సులు తిరగని గ్రామాల ప్రజలు తమకు ఆ అవకాశం ఎప్పుడొస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. కొన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం ఉన్నా బస్సులు మాత్రం నడవడంలేదు. మరికొన్నింటికి పాఠశాల సమయాల్లోనే నడుపుతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో నెలకొన్న ఈ పరిస్థితులపై కథనం.566 పంచాయతీలుజిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో 21 మండలాలు, 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో జనాభా తక్కువని తాలూకా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన మూడు ఆర్టీసీ డిపోలు మాత్రమే నేటికీ కొనసాగుతున్నాయి. కొత్తవి ఎక్కడా అందుబాటులోకి రాలేదు. కొడంగల్ నియోజక వర్గం వికారాబాద్ జిల్లాలో కలిసినా బస్ డిపో కోస్గి పరిధి కిందకు వస్తుంది.

# ఇక బదిలీలు..!

నల్గొండ : అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టడంతో మూడు జిల్లాల్లోని రెవెన్యూ, పోలీసు వర్గాల్లో బదిలీల చర్చ సాగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడు బదిలీలు అనివార్యమైనప్పటికీ ఈ దఫా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున రెవెన్యూతో పాటూ పోలీసు శాఖలో బదిలీలు జరుగుతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ పనిచేస్తున్న రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు, డివిజన్లు, మండలాల్లో పనిచేస్తున్న చాలా మంది అధికారులు గత భారాస ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించిన వారే. గతంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర కీలక ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చిన వారిని కొనసాగించవద్దని ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నాయకులు వారి ప్రజాప్రతినిధులకు సూచిస్తున్నారు. దీంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారితో పాటూ జిల్లా స్థాయిలోని మెజార్టీ శాఖల్లోని అధికారులందరికీ బదిలీలు ఉండొచ్చన్న అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తాజా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవులు దక్కడంతో వారి ఆదేశానుసారం మూడు జిల్లాలకు కొత్త అధికారులు వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నల్గొండ నియోజకవర్గం, మరికొన్ని ప్రాంతాల్లో గత ఎమ్మెల్యేల సిఫార్సులతో వచ్చిన వారిని బదిలీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

బదిలీల ప్రక్రియ ఎవరెవరికో..?

వచ్చే నెలాఖరుకు క్షేత్రస్థాయిలో పాలనకు కీలకమైన సర్పంచిల పదవీకాలం ముగియనుండటంతో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ పంచాయతీల వారీగా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. దీంతో




పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నల్గొండ జిల్లా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల మార్పు అనివార్యమైతే తప్ప ఉండబోదని తెలిసింది. సూర్యాపేట జిల్లాలోని ఉన్నతాధికారి కొన్ని నెలల్లోనే పదవీ విరమణ చేయాల్సి ఉన్న దృష్ట్యా ఆయన్ను కొనసాగించే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన పోలీసు ఉన్నతాధికారి బదిలీ మంత్రి ఉత్తమ్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. యాదాద్రి జిల్లాలోని పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల మార్పుపై ఇంకా స్పష్టత వెలువడలేదు. అయితే ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టిన వారిని సమూలంగా మార్చి తమకు అనుకూలమైన వారిని తీసుకొచ్చే అవకాశం ఉందని సీనియర్ ఎమ్మెల్యే ఒకరు 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు. అయితే మూడు జిల్లాల్లోని డివిజన్, మండలాల స్థాయి అధికారులు మాత్రం పెద్దఎత్తున బదిలీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పోలీసు శాఖలోనూ గణనీయంగా బదిలీలు ఉండనున్నాయి. ఎన్నికలకు ముందు సొంత జిల్లాల్లో మూడేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసిన తహసీల్దార్లను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేయగా... వారి బదిలీలు పార్లమెంటు ఎన్నికల తర్వాతనే ఉండనున్నాయి. అయితే జిల్లాలో అంతర్గతంగా మాత్రం తహసీల్దార్ల బదిలీలు ఉండనున్నాయని రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది.

# ఎత్తిపోతల పథకాలపై కొత్త ఆశలు

నల్గొండ : ఏఎమ్మార్పీ- ఎస్సెల్బీసీ నీటితో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించేందుకు రూపకల్పన చేసిన బి.వెల్లంల, అయిటిపాముల ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులు కొత్త ప్రభుత్వ హయాంలో త్వరితగతిన పూర్తవుతాయన్న ఆశలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఎనిమిది మండలాల్లోని 1.08 లక్షల ఎకరాలకు సాగునీరు, 107 గ్రామాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టులను మంజూరు చేశారు. బి.వెల్లంల ప్రాజెక్టు కోసం నాడు కృషి చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మళ్లీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖ కేటాయించడంతో ఈ రెండు ప్రాజెక్టుల పనులు కొత్త ప్రభుత్వ హయాంలో త్వరితగతిన పూర్తవుతాయన్న ఆకాంక్షలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. 16 ఏళ్లుగా సాగుతున్న పనులు నాడు మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బి.వెల్లంల ఎత్తిపోతల ప్రాజెక్టుకు తమ సొంత గ్రామంలో అప్పటి సీఎం వైఎస్ చేతుల మీదుగా 2007 సెప్టెంబరు 4న శంకుస్థాపన చేయించారు. 16 ఏళ్ల నుంచి పనులు కొనసాగుతున్నా యి. ఇటీవలే చివరిదశకు చేరాయి. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. తాజాగా కోమటిరెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఇక ఈ ప్రాజెక్టు తుదిదశ పనులు శరవేగంగా పూర్తయి పొలాలకు నీరందనుందని రైతులు ఆశిస్తున్నారు. భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి ఆధ్వర్యంలో గడిచిన మే నెలలో బి.వెల్లంల ట్రయల్‌రన్‌ను పూర్తిచేశారు. దీనికి సంబంధించి రైతుల భూముల వద్దకు నీటిని తీసుకెళ్లే కుడి, ఎడమ కాల్వల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉంది. కాల్వల కోసం 3,851 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉండగా 1,456 ఎకరాల సేకరణ పూర్తిచేశారు. రూ. 101 కోట్లతో పనులు నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ఎగువ ప్రాంత గ్రామాల్లో ఎనిమిది వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించేందుకు అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. 2018 నవంబరు 21న నకిరేకల్‌లో తెరాస అభ్యర్థి వేముల వీరేశం విజయం కోసం నిర్వహించిన సభలో నాటి సీఎం కేసీఆర్ పాల్గొని రూ. 111 కోట్లతో అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశామని ప్రకటించారు. దాదాపు ఐదేళ్లకు రూ. 101.62 కోట్లతో, 2023 సెప్టెంబరు 29న నాటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కృషితో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలు ఈ పథకం పనులు ప్రారంభించారు. ఈ ఎత్తిపోతల పథకం కోసం మొదటిసారి శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు కృషిచేసిన వేముల వీరేశం ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలుపొం దడం, ఈ జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖ కేటాయించడంతో అయిటిపా ముల సాగునీటి పథకం పనులు శరవేగంగా గడువు లోపుగా రైతుల్లో చిగురిస్తున్నాయి.

## కిడ్నీ రీసెర్చ్ సెంటర్..సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం వైయస్ జగన్



శ్రీకాకుళం: ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్–సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు, అలాగే అన్ని రకాల కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేసేందుకు పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు.. మూడు బ్లాకులుగా నాలుగు అంతస్తుల్లో ఆస్పత్రి నిర్మాణం. క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, పాథాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్స్, సెంట్రల్ ల్యాబ్స్, నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, డయాలసిస్, పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ, రీసెర్చ్ ల్యాబ్‌తో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. సీటీ స్కాన్, 2డీ ఎకో, హై ఎండ్ కలర్ డాప్లర్, మొబైల్ ఎక్స్ రే (డిజిటల్), థూలియం లేజర్ యూరో డైనమిక్ మెషీన్ తదితర పరికరాలతో పాటు ఐసీయూ సౌకర్యాలు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఇప్పటికే 42 స్పెషాలిటీ డాక్టర్ పోస్టులు, 60 స్టాఫ్ నర్సు పోస్టులు, 60 ఇతర సహాయ సిబ్బంది పోస్టుల భర్తీ చేశారు.

# సుజలధార ప్రాజెక్టు జాతికి అంకితం

## వైయస్ఆర్ సుజలధార ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం వైయస్ జగన్



శ్రీకాకుళం: వైయస్ఆర్ సుజల ధార డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన సుజలధార ప్రాజెక్టు సీఎం వైయస్ జగన్ జాతికి అంకితం చేశారు. ఉద్దానం ప్రాంతంలో కళ్లెదుటే కిడ్నీ సమస్య కనిపిస్తున్నా గతంలో ఎవరూ దీనికి పరిష్కారం చూపడానికి కూడా సాహసించలేదు. ఇలాంటి పరిస్థితిలో వైయస్ జగన్ ప్రభుత్వం రూ.785 కోట్లు భారీ వ్యయం చేసి మరీ.. ఉద్దానం వ్యాధిగ్రస్తుల సముస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపింది. ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజెస్) ప్రబలంగా ఉన్న ఏడు మండలాల్లోని అన్ని గ్రామాలకు 'వైఎస్సార్ సుజలధార' ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన రక్షిత తాగునీరు. హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో 7 మండలాల్లోని 807 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 6.78 లక్షల జనాభా 2051 నాటికి 7.85 లక్షలకు చేరుతుందన్న అంచనాతో అప్పటి అవసరాలకు కూడా సరిపోయేలా ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్ల చొప్పున నీటి సరఫరా చేసేలా ప్రాజెక్టు నిర్మాణం. ఇప్పటికే 613 గ్రామాలకు నీటి సరఫరా.




దిల్లీ: దేశ అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో బుధవారం చెలరేగిన అలజడి పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం కీలక మంత్రులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రులు ప్రహ్లాద్ జోషీ, అనురాగ్ ఠాకూర్, పీయూష్ గోయల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా కూడా సమావేశానికి హాజరయ్యారు.

**ఎనిమిది మంది సిబ్బందిపై వేటు..** మరోవైపు భద్రతా వైఫల్యంపై లోక్‌సభ సెక్రటేరియట్ చర్యలు చేపట్టింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఎనిమిది మంది భద్రతా సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళన..** లోక్‌సభలో బుధవారం చోటుచేసుకున్న ఘటనపై పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు గురువారం ఆందోళన చేపట్టాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే భద్రతా వైఫల్యంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. వారి ఆందోళనల మధ్య సభ కొంతసేపు సాగింది. అయితే, విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో స్పీకర్ వారిని వారించారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భద్రతా వైఫల్యంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. అంతకుముందు లోక్‌సభలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. దీనిపై స్పీకర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. పాస్‌లు ఇచ్చే విషయంలో మనం మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం" అని వెల్లడించారు.

**బూట్లను కూడా స్కాన్..** తాజా ఘటన నేపథ్యంలో పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పార్లమెంట్ భవనంలోకి ప్రవేశాలపై ఆంక్షలు విధించారు. ఎంపీలు ప్రవేశించే 'మకర ద్వారం' నుంచి ఇతరులు వెళ్లకుండా నిషేధం విధించారు. మీడియాపైనా ఆంక్షలు కొనసాగుతున్నాయి. ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించి మీడియా సిబ్బందికి పాసులు జారీ చేస్తున్నారు. ఇక పార్లమెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి బూట్లను కూడా స్కాన్ చేస్తున్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అధికారుల్ను వెల్లడించారు.

## ఏపీని నెం.1లో నిలుపుతామంటే ఏంటో అనుకున్నాం.. ఇలా అనుకోలేదు జగనన్నా..



విశాఖపట్నం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతీ రోజు ఏదో ఒక అంశంపై ట్విట్టర్ వేదికగా సీఎంపై గంటా విరుచుకుపడుతూనే ఉన్నారు. తాజాగా మరోసారి జగన్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను నెం.1లో నిలుపుతాను అంటే ఏంటో అనుకున్నామని.. నిరుద్యోగంలో అని గ్రహించలేక పోయాము జగనన్న అంటూ ఎద్దేవా చేశారు. చరిత్రలో బీహార్‌ను కూడా వెనక్కి నెట్టేసి మరీ పట్టభద్రులను నిరుద్యోగంలో 24%తో మొదటి స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జాతీయ సరాసరినే 13.4 శాతంగా ఉంటే జాతీయ సరాసరి కన్నా 11 శాతం అధికంగా రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌ను నిరుద్యోగంలోకి నెట్టేశారన్నారు. జాతీయ సగటు కంటే నిరుద్యోగంలో 12 రాష్ట్రాలు పైన ఉంటే వాటిల్లో ఏపీనే అగ్రస్థానంలో నిలిపారన్నారు.

కేవలం కక్షలు కార్పణ్యాలపైన దృష్టి పెట్టి రాష్ట్రాన్ని అట్టడుగుకు నెట్టేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఒక్క నిరుద్యోగంలోనే కాదు అన్ని రంగాలలో పాతాళంలోకి నెట్టేశారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు అధైర్య పడాల్సిన అవసరం లేదని.. 2024లో చంద్రబాబు నాయుడు అనే బ్రాండ్‌తో రాష్ట్రానికి పూర్వ వైభవం రావడం తథ్యమని స్పష్టం చేశారు. యువత ఓటు అనే ఆయుధంతో ఈ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడి, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు.

## టీటీడీ ఖజానాపై జగన్ కన్ను.. అందుకే

న్యూఢిల్లీ: టీటీడీ ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక క్షేత్రమని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి అని.. భక్తుల కానుకలతో నడిచే ఏకైక దేవస్థానం టీటీడీ అని చెప్పుకొచ్చారు. రూపాయి కూడా ప్రభుత్వం నుంచి టీటీడీ ఖజానాకు రాదన్నారు. గత కొన్ని ఏళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ నిధులపై కన్నేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని.. అందుకు జగన్మోహన్ రెడ్డి కన్ను టీటీడీ ఖజానాపై పడిందన్నారు. టీటీడీ నిధులను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఇది మంచిది కాదని భారతీయ జనతా పార్టీ హెచ్చరిస్తుందన్నారు. శ్రీవారి భక్తులను కలుపుకొని అనేక ఏళ్ళ నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. తిరుపతిలో శానిటేషన్ పేరిట 100 కోట్ల రూపాయలు టీటీడీ నిధులు ఖర్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీ నిధులు వినియోగిస్తున్నారన్నారు. ఇది చైర్మన్ కరుణాకర్ రెడ్డి కుమారుడుని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తిరుపతికి టీడీపీ నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ అయిన తర్వాత మూడు నెలల్లో రూ.200 కోట్ల పైన నిధులను ఖర్చు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఇవన్నీ జరుగుతున్న తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు మంచిది కాదని భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు.




## అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం ఉక్కుపాదం

అమరావతి: అంగన్‌వాడీల ఉద్యమం ఏపీ రాష్ట్రంలో పతాక స్థాయికి చేరుకుంది. తమ న్యాయమైన కోర్కెల కోసం గత మూడు రోజుల నుంచి అంగన్‌వాడీలు ఉద్యమ బాట పట్టిన విషయం తెలిసిందే. అయితే అంగన్‌వాడీల ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాద మోపుతోంది. అమరావతి: అంగన్‌వాడీల ఉద్యమం ఏపీ రాష్ట్రంలో పతాక స్థాయికి చేరుకుంది. తమ న్యాయమైన కోర్కెల కోసం గత మూడు రోజుల నుంచి అంగన్‌వాడీలు ఉద్యమ బాట పట్టిన విషయం తెలిసిందే. అయితే అంగన్‌వాడీల ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ యూనియన్ నేతలను పోలీసులు స్టేషన్‌లకు పిలిపిస్తున్నారు.

మరోవైపు మూసివేసిన అంగన్‌వాడీ సెంటర్‌లను తాళాలు బద్దలు కొట్టి తెరవాలని సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు ఆదేశాలిస్తున్నారు. గురువారం నుంచి సెంటర్లనన్నింటిని తెరవాలని ఆదేశించారు. నిన్న సాయంత్రం కొన్ని సెంటర్లను సచివాలయం సిబ్బంది తెరిచారు. అయితే తెరిచిన సెంటర్లకు మళ్లీ అంగన్‌వాడీలు తాళాలు వేశారు. ఈ రోజు మోకాళ్ళపై కూర్చుని నిరసన తెలియచేయాలని అంగన్‌వాడీ సంఘాలు నిర్ణయించాయి. సెంటర్లను తెరచి డ్వాక్రా సంఘాలతో ఫుడ్ తయారుచేయించి పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సరుకులకు డబ్బులు ఇవ్వకుండా వంట ఎలా తయారు చేస్తామని డ్వాక్రా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కాగా అంగన్‌వాడీల డిమాండ్‌లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లుపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. మరోవైపు అన్ని రాజకీయ పక్షాలు, వారి అనుబంధ సంఘాలతో మాట్లాడి ఉద్యమం ఉధృతం చేయాలని అంగన్‌వాడీ సంఘాలు నిర్ణయించాయి. జగన్ ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని అడుగుతున్నామని అంగన్‌వాడీ సంఘాలు చెబుతున్నాయి.




## ఏపీలో టెన్త్, ఇంటర్ పరీక్షల తేదీలను ప్రకటించిన మంత్రి బొత్స

ఏపీలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పదో తరగతి, ఇంటర్ పరీక్షలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని జగన్ సర్కారు భావిస్తోంది. ఈ మేరకు ఏపీలో టెన్త్, ఇంటర్ పరీక్షల తేదీలను మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం మధ్యాహ్నం ప్రకటించారు. మార్చి 18 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 1 నుంచి 15 వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఇంటర్ ప్రాక్టీకల్స్ ఫిబ్రవరి 5 నుంచి 25 వరకు థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 15 వరకు ఉంటాయని మంత్రి బొత్స వివరించారు.

కాగా 16 లక్షల మంది విద్యార్థులు టెన్త్, ఇంటర్ పరీక్షలను రాయనున్నట్లు మంత్రి బొత్స వెల్లడించారు. 6 లక్షల మంది టెన్త్ పరీక్షలను, 10 లక్షల మంది ఇంటర్ ఫస్ట్, సెకండియర్ పరీక్షలను రాయనున్నట్లు తెలిపారు. ఒకటే రోజు మొదటి, ద్వితీయ సంవత్సర ఇంటర్ పరీక్షలు ఉండవని.. ఆల్టర్‌నేట్ డేస్‌లో జరుగుతాయని చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నుండి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు.




విశాఖపట్నం : నగరంలో జగదాంబ కూడలి సమీపంలోని ఇండస్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగింది. ఆస్పత్రిలోని మొదటి అంతస్తు ఆపరేషన్ థియేటర్‌లో మంటలు వచ్చాయి. దీంతో ఆ తర్వాత మిగిలిన అంతస్తులకు పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు. ఆస్పత్రిలోని సుమారు 40 మంది రోగులను అంబులెన్స్‌లలో వివిధ ఆస్పత్రులకు తరలించారు. అగ్నిప్రమాదంతో ఇండస్ ఆస్పత్రి ఆవరణలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. పైఅంతస్తుల్లోని కొంతమంది రోగులను నిచ్చెనల సహాయంతో కిందికి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంతో రోగులు, వారి బంధువులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్‌తో జరిగినట్లు భావిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ చేపట్టారు.

## అంగన్‌వాడీ దీక్ష శిబిరాన్ని సందర్శించిన లోకేష్




అనకాపల్లి జిల్లా: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉత్సాహంగా సాగుతోంది. 222వ రోజు గురువారం ఉదయం యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం కొత్తూరు ఎస్వీ కన్వెన్షన్ క్యాంప్ సైట్ నుంచి యువనేత పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా లైను కొత్తూరులో రోడ్డు మార్గంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ మూడవరోజు సమ్మె చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. అయితే అంగన్‌వాడీల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఇదివరకే లోకేష్ ప్రకటించారు. కాగా యువనేత లోకేష్ పాదయాత్రకు అడుగడుగున ప్రజలు నీరాజనం పలుకున్నారు. నిన్నటి వరకు నడిచిన మొత్తం దూరం 3059.6 కి.మీ. కాగా లోకేష్ పాదయాత్రలో తెలుగుదేశం, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాయంత్రం ఆరు గంటలకు కొత్తూరు సెంటర్‌లో సభ నిర్వహించరు. వివిధ వర్గాల వారిని కలుస్తూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ .. అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీల ఇస్తూ లోకేష్ ముందుకు సాగుతున్నారు.

## సీపీఐ రామకృష్ణ సంచలన కామెంట్స్..



విజయవాడ: రాష్ట్రంలో తుఫాన్ వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయిందని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మొత్తం 440 మండలాల్లో కరవు ఉంటే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తుఫాన్ వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీసం సిగ్గుందా అని నేను ప్రశ్నిస్తున్నా.. అంటూ ఆయన అన్నారు.

ఎన్నికలకు ముందు అందరి తలపై చేయి వేసి తిరిగావు.. ఇప్పుడు పొలాల్లో దిగకుండా షో చేస్తున్నావు.. అని ఆయన అన్నారు. ఓట్లు కోసం ఎత్తులు వేశావు... అన్నివర్గాల ప్రజలను, రైతులను చిత్తు చేశావని, కరవు, తుఫాన్ ప్రాంత రైతుల పిల్లలకు ఫీజు మాఫీ చేయాలి ఆయన డిమాండ్ చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, మంత్రులు క్షేత్ర స్థాయిలో పంట నష్టం పరిశీలించాలని, కేంద్ర బృందాలను కలిసి నష్టం వివరాలను అందచేస్తామని, ఢిల్లీ స్థాయిలో అందరినీ కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని రామకృష్ణ అన్నారు.

## 2023 శృతిహాసన్ కెరీర్ లో ఓ మ్యాజిక్!

2023 కి గుడ్ బై చెప్పి 2024 కి వెల్కమ్ చెప్పడానికి భామా మణులంతా రెడీ అయిపోతున్నారు. ఇప్పటికే డిసెంబర్ ద్వితియార్ధానికి వచ్చేసిం. మరో 20 రోజుల్లో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టబోతున్నాం. ఈ సందర్భం హీరోయిన్లు అంతా డిసెంబర్ నెల మొదలైన దగ్గర నుంచి కొత్త ఫోటోలతో ట్రీట్ ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఈరేసులో టాలీవుడ్..కోలీవుడ్ భామలు తక్కువగా ఉన్నప్పటికీ బాలీవుడ్ భామల్లో ఈ కల్చర్ ఎప్పటి నుంచో ఉంది. యధావిధిగా ఈ ఏడాది కూడా దాన్ని కొనసాగిస్తున్నారు. అందుకు నేనేమి అతీతం కాదంటోంది శ్రుతి హాసన్. ఈ అమ్మడు కూడా 2023 జ్ఞాపకాల్ని స్మరించుకుంటు కొన్ని థింగ్స్ ని ఇన్ స్టా లో షేర్ చేసింది. 2023 అద్భుతంగా ఉంది. చాలా కృతజ్ఞతలు.. ఇంకా నా జీవితంలో ఏమి రాబోతుందో' అని ఎదురు చూస్తున్నాను అని రాసుకొచ్చింది. నిజమే 2023 శ్రుతిహాసన్ కి ఎంతో కలిసొచ్చింది. 2022 లో ఎలాంటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాలేదు. కానీ 2023 లో మాత్రం వరుస విజయాలతో మంచి ఊపు మీదనే ఏడాదిని



ముగించబోతుంది. 'వీరసింహా రెడ్డి'..'వాల్తేరు వీరయ్య'తో అమ్మడు వరుసగా విజయాలు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇటీవలే రిలీజ్ అయిన 'హాయ్ నాన్న'లో స్పెషల్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. ఆ సినిమా కూడా మంచి విజయం సాధించింది. ఇలా అమ్మడికి 2023 లోమూడు విజయాలతో హ్యాట్రిక్ అందుకుందని చెప్పొచ్చు. ఇక 'సలార్' మొదటి భాగంతో పాన్ ఇండియాని షేక్ చేయడానికి రెడీ అవుతుంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ లో ఆ సినిమా పాన్ ఇండియాలో రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇందులో ఆద్య పాత్రలో శ్రుతి హాసన్ కనిపించ బోతుంది. ఈ సినిమాతో భారీ బ్లాక్ బస్టర్ అందుకుని 2023 ని గ్రాండ్ గా ముగించబోతుందని ఆశలు పెట్టుకుంది. ఈ విషయంలో శ్రుతి హాసన్ చాలా లక్కీ అని చెప్పాలి. ఇలా ఏడాదిని ముగించే అవకాశం ఎవరికో గానీ దక్కదు. ఇప్పుడా లక్కీ ఛాన్స్ శ్రుతి చేతిలో ఉంది. మరి సలార్ ఎలాంటి టాక్ తో శ్రుతిహాసన్ సంతోషాన్ని రెట్టింపు చేస్తుందో చూడాలి.

## కమ్ముల సినిమా మిస్ చేసుకున్న మంగ్లీ.. నిజమేనా..

టాలీవుడ్ లో స్టార్ సింగర్ గా దూసుకుపోతున్న మంగ్లీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. న్యూస్ యాంకర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన మంగ్లీ తెలంగాణ ఫోక్ సాంగ్స్ తో పాపులర్ అయ్యింది. తనదైన స్వరంతో ప్రత్యేకత చాటుకొని ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్స్ ద్వారా విశేషమైన గుర్తింపు దక్కించుకుంది. తరువాత సింగర్ గా సినిమాలలో ఛాన్స్ లు రావడమే కాకుండా ఆమె పాటలు సూపర్ హిట్ అయ్యాయి. దీంతో గాయనిగా వరుస అవకాశాలు అందుకుంటూ తిరుగులేని ఇమేజ్ తో స్టార్ సింగర్ గా మంగ్లీ దూసుకుపోతోంది. టాలీవుడ్ లో ఆమె సాంగ్ లేకుండా సినిమా రావడం లేదంటే ఏ స్థాయిలో ఇంపాక్ట్ చూపిస్తోందో అర్ధం చేసుకోవచ్చు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని సింగర్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని మంగ్లీ క్రియేట్ చేసుకుంది.



ఫోక్, డివోషనల్, మోడరన్ టచ్ తో అన్ని రకాల జోనర్స్ లో సాంగ్స్ పాడుతోంది. అయితే నటిగా కూడా మంగ్లీ అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటుంది. ముఖ్యంగా ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్స్ అన్నింటిలో తన పాటలకి తానే డాన్స్ పెర్ఫార్మెన్స్ తో వీడియో సాంగ్స్ చేస్తూ ఉంటుంది. ఈ కారణంగా నటిగా కూడా ఆమెకి సరైన పాత్రలు పడితే దూసుకుపోయే చరిష్మా ఉందనే టాక్ టాలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో చాలా మంది మంగ్లీ లీడ్ రోల్ లో సినిమాలు చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆమె మాత్రం లీడ్ రోల్స్ సున్నితంగా తిరస్కరిస్తోంది. అలాగే ఒక సూపర్ హిట్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ని మంగ్లీ వదులుకుంది అనే టాక్ వినిపిస్తోంది. సాయి పల్లవి హీరోయిన్ గా టాలీవుడ్ కి పరిచయం అయిన శేఖర్ కమ్ముల ఫిదా సినిమాలో మొదటిగా మంగ్లీని హీరోయిన్ గా అడిగారంట. అయితే ఆమెకి హీరోయిన్ గా చేయడం ఇష్టం లేకపోవడం చేయనని చెప్పిందంట. శేఖర్ కమ్ముల తర్వాత చాలా మంది హీరోయిన్స్ ని ప్రయత్నం చేసి ఫైనల్ గా సాయి పల్లవిని ఒకే చేశారు. ఫిదా సినిమా సాయి పల్లవి ఇమేజ్ ని అమాంతం పెంచేసింది. తెలుగులో స్టార్ యాక్టర్ గా ఆ సినిమాతో మారిపోయింది. అలా ఫిదా సినిమా ఛాన్స్ మంగ్లీ వదులుకుంటే సాయి పల్లవికి వచ్చిందనే ప్రచారం ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తోంది.




## సైంధవ్.. బాక్సాఫీస్ బలం కోసం ఇలా!




శైలేష్ కొలను దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ మైల్ స్టోన్ 75వ సైంధవ్ పై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఎందుకంటే ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి అప్‌డేట్ కోసం బృందం ఒక ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటికే టీజర్, సాంగ్ విడుదల చేశారు. ఈరోజు వీవీఐటీ కాలేజీలో విద్యార్థుల సమక్షంలో సినిమా రెండో సింగిల్‌ని ఆవిష్కరించారు. వెంకటేష్ గతంలో ఎప్పుడు లేనంత హైప్ తో సినిమాకు ప్రమోషన్స్ చేస్తున్నారు. ఫ్యామిలీ హీరోగా మంచి గుర్తింపు అందుకున్న వెంకీ సాధారణ జనాల్లోకి వెళ్లి సినిమాను ప్రమోట్ చేస్తున్నాడు. ఇక ఇప్పుడు 'సరదా సరదాగా..' అనే లిరికల్ సాంగ్ ను విడుదల చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరిచిన ఈ ఇది మనోహరమైన పాటలో వెంకటేష్ మరియు శ్రద్ధా శ్రీనాథ్ మధ్య సాగే సంభాషణతో కూడా హైలెట్ గా నిలిచింది. వెంకీ కూతురుగా సారా మంచి ఫ్యామిలీ సాంగ్ తో ఆకట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పాట ముగ్గురి మధ్య కొన్ని హృదయాలను కరిగించే క్షణాలను చూపిస్తుంది. ఇక వారి ఫ్యామిలీ మూమెంట్స్ కూడా ఆకట్టుకుంటున్నాయి. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం వారి మధ్య బంధాన్ని వివరిస్తుండగా, అనురాగ్ కులకర్ణి గాత్రం ఆ పాటకు ప్రత్యేక ఆకర్షణను తెస్తుంది. మొదటి పాట మాస్‌కి, యూత్‌కి బాగా కనెక్ట్ అయితే, ఇది ఫ్యామిలీలకు కనెక్ట్ అవుతుంది అనిపిస్తోంది. వెంకీ సినిమా అంటే ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కువగా ఎట్రాక్ట్ అవుతారు. ఇటీవల హాయ్ నాన్న సినిమాకు కూడా ఫ్యామిలీ ఆడియెన్స్ సపోర్ట్ వల్లనే బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ పెరిగాయి. చూస్తుంటే సైంధవ్ సినిమా యూనిట్ కూడా అదే తరహాలో ఎట్రాక్ట్ చేస్తున్నట్లు అనిపిస్తుంది. మరి వారి ప్లాన్ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.మణికందన్. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, గ్యారీ బిహెచ్ ఎడిటర్. ఇక నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, జయప్రకాష్‌లు సినిమాలో ఇతర ముఖ్య తారాగణం. కిషోర్ తాళ్లూరు సహ నిర్మాతగా ఉన్న సైంధవ్ జనవరి 13, 2024న అన్ని దక్షిణ భారత భాషలు మరియు హిందీలో విడుదల కానుంది.

## కాంతార 2.. మిస్టరీ ఎప్పుడంటే?



రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్ చేసిన కాంతారా మూవీ ఎంతపెద్ద హిట్ అయ్యిందో అందరికి తెలిసిందే. రిలీజ్ అయిన అన్ని భాషలలో ఆ మూవీ సూపర్ హిట్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా భారీ కలెక్షన్స్ కొల్లగొట్టింది. ఇప్పుడు దానికి ప్రీక్వెల్ సిద్ధం అవుతోంది. కాంతార 2 టైటిల్ తో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్ కూడా స్టార్ట్ అయ్యింది.

భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని హొంబలే ఫిలిమ్స్ నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే సలార్ మూవీ రిలీజ్ ప్రమోషన్స్ లో భాగంగా నిర్మాత విజయ్ కిరంగదూర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో సలార్ చిత్ర విశేషాలతో పాటుగా కాంతారా2 గురించి కూడా క్లారిటీ ఇచ్చారు. కాంతారా 2 మూవీని భారీ కాన్వాస్ పై ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది ఆఖరులో కానీ లేదంటే 2025 ప్రథమార్ధంలో మూవీ రిలీజ్ చేస్తామని స్పష్టం చేశారు. మొదటి చిత్రంలో నటించిన నటీనటులు రెండో భాగంలో కొంతమంది ఉంటారని క్లారిటీ ఇచ్చారు. కచ్చితంగా ఈ మూవీ కాంతారాకి మించి ప్రేక్షకులకి కనెక్ట్ అవుతుందని తెలిపారు. ఇక సలార్ చిత్రం పై వస్తోన్న రూమర్స్ పైన విజయ్ కిరంగదూర్ స్పందించారు. సలార్ కన్నడ మూవీ ఉగ్రం రీమేక్ అని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చేశారు. సలార్ మూవీ ఇద్దరు మిత్రులకి సంబందించిన స్టోరీ కావడంతో ఉగ్రంతో పోల్చారని, అయితే రెండింటికి చాలా వ్యత్యాసం ఉంటుందని అన్నారు. ప్రశాంత్ నీల్ మేకింగ్, విజువలైజేషన్ చాలా ప్రత్యేకంగా ఉంటాయని, అస్సలు ఒక కథకి ఇంకో కథకి సంబంధం ఉండదని క్లారిటీ ఇచ్చారు. కచ్చితంగా సలార్ ప్రతి ఒక్కరికి నచ్చుతుందని తెలిపారు. అలాగే మూవీ నుంచి ఒక సాంగ్ రిలీజ్ చేస్తామని, యాక్షన్ ట్రైలర్ ఒకటి రెడీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

నిర్మాత విజయ్ కింరగదూర్ ఇంటర్వ్యూ ద్వారా సలార్ మీద ఉన్న డౌట్స్ కి క్లారిటీ దొరకడంతో పాటు కాంతారా 2 ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది స్పష్టత వచ్చేసింది. ఇక సలార్ సినిమా తరువాత KGF3 కూడా ఉంటుందని దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. ఇక ఆ సినిమా మాత్రం మరో దర్శకుడితో తెరపైకి వచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మరోవైపు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ తో న్యూ ప్రాజెక్టు స్టార్ట్ చేయనున్నాడు.

## బేబమ్మ అప్పుడే బోర్ కొట్టేసిందా..?

మొదటి సినిమానే యూత్ ఆడియన్స్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న భామ కృతి శెట్టి. ఉప్పెనలో బేబమ్మ పాత్రలో అమ్మడి అభినయం ఆడియన్స్ ని ఆకట్టుకుంది. పదహారేళ్ల వయసు సినిమాలో శ్రీదేవిలా అమ్మడిని వర్ణిస్తూ సోషల్ మీడియాలో ఒకటే హడావిడి చేశారు. ఫస్ట్ సినిమా హిట్టైతే ఇక అవకాశాల గురించి చెప్పనక్కర్లేదు. వరుసగా అరడజను సినిమాలు రావడం చక చకా అవన్నీ చేయడం జరిగింది. అయితే ఈ గ్యాప్ లో ఫ్లాపులు కూడా రుచి చూడాల్సి వచ్చింది. వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వెళ్తే కెరీర్ మీద ఎఫెక్ట్ పడుతుంది. కథ విషయంలో కాత జాగ్రత్త పడాలన్న ఆలోచన వచ్చే సరికి కెరీర్ ట్రాక్ తప్పింది. ఇప్పుడు మళ్లీ దాన్ని గాడిలో పడేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది కృతి శెట్టి. ప్రస్తుతం శర్వానంద్ సినిమాలో నటిస్తున్న కృతి శెట్టి అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. కన్నడలో టోవినో థామస్ తో సినిమా చేస్తున్న కృతి అక్కడ గ్రాండ్ ఎంట్రీ ఇస్తుంది. చేసిన 7 సినిమాల్లోనే హిట్ జోష్ ని ఫ్లాప్ తో వచ్చే



నిరుత్సాహాన్ని ఎదుర్కొన్న కృతి శెట్టి ఇక మీదట కెరీర్ ని పర్ఫెక్ట్ గా ప్లాన్ చేయాలని అనుకుంటుంది. అందుకే ఈమధ్య సినిమాల విషయంలో ఆచి తూచి అడుగులేస్తుంది. రీసెంట్ గా ఒక సినిమా తన దాకా వచ్చినా హీరోయిన్ పాత్రకు అంతగా ప్రాముఖ్యత లేకపోవడం వల్ల కాదనేసిందట. కృతి శెట్టి మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని ప్రయత్నిస్తుంది. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఈమధ్య ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేస్తుంది అమ్మడు. బేబమ్మ పని అయిపోయింది అనుకున్న వారికి రెట్టింపు ఉత్సాహంతో వారికి ఆన్సర్ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. తెలుగులో శర్వానంద్ తో సినిమా చేస్తున్న అమ్మడు తమిళంలో జినీ సినిమా చేస్తుంది. ఈ సినిమాలతో అయినా కృతి శెట్టి మళ్లీ ప్రేక్షకుల మనసు గెలుస్తుందేమో చూడాలి. టాలీవుడ్ లో గుడ్ స్టార్ట్ ఇచ్చినా ఆ తర్వాత కెరీర్ నిరాశపరచడంతో మళ్లీ తిరిగి తన సత్తా చాటాలని చూస్తుంది కృతి శెట్టి. ఒక్క ఫ్లాప్ పడగానే హీరోయిన్ ఫేట్ మారిపోతుంది. అందుకే అన్ని విధాలుగా జాగ్రత్త పడాలని చూస్తున్నారు. కృతికి ఆల్రెడీ దెబ్బ తగిలింది కాబట్టి అమ్మడు ఇక మీదట ఆ తప్పు చేసే ఛాన్స్ ఉండదని చెప్పొచ్చు.

## డీప్ ఫేక్ పై హీరోయిన్ ఏమంటుందంటే?

డీప్ ఫేక్ వీడియోలు సెలబ్రిటీల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఒక్కొక్కొరుగా డీప్ ఫేక్ బారిన పడటంతో ఏ క్షణంలో ఏ హీరోయిన్ దొరికిపోతుందో? అర్ధం కాని సన్నివేశం ఎదురైంది. ఇప్పటికే రష్మిక మందన్న.. అలియాభట్ సహా పలువురు హీరోయిన్లు డీప్ ఫేక్ బారిన పడ్డ సంగతి తెలిసిందే. తాజాగా అలియాభట్ డీప్ ఫేక్ పై స్పందించింది. 'ఎక్కడ మంచి ఉంటుందో? అక్కడ చెడూ ఉంటుంది. కానీ సమస్యని ఎదుర్కొనే పరిష్కారం కూడా కనుగొనాలి. ఏఐ సాంకేతిక ఎంతో ఉపయుక్తంగా ఉంది. కొన్ని రంగాలకు.. ప్రొఫెషనల్స్ కి కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే దుర్వినియోగం అవుతుంది. అలా దుర్వినియోగం అవుతుందని వెనకడుగు వేయడానికి వీలు లేదు. కొత్త కొత్త టెక్నాలజీలు అందిపుచ్చుకోవాలి. డీప్ ఫేక్ బారి నుంచి ప్రజలను కాపాడాలే కొత్త చట్టాలు వస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రష్మిక మందన్నా



కూడా డీప్ ఫేక్ పై స్పందించిన సంగతి తెలిసిందే. వ్యక్తిగతంగా తన ముఖంతో వచ్చిన వీడియో తనని ఎంతగా బాధించిందో సోషల్ మీడియా వేదికగా వాపోయింది. ప్రభుత్వాలు కొత్త చట్టాలు తీసుకురావాలని..ఇలాంటి వీడియోలు వచ్చిన ప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ అలెర్ట్ అయి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. అలాగే బిగ్ బీ అమితాబచ్చన్ కూడా రష్మిక వీడియోపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. అలాంటి తప్పుడు వీడియోలు సృష్టించే వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని..దీనిపై సెలబ్రిటీలంతా స్పందించాలని పిలుపునిచ్చారు. ఇంకా టాలీవుడ్ నుంచి కూడా చాలా మంది హీరోలు..హీరోయిన్లు రష్మికకు మద్దతుగా నిలిచారు. అయినా డీప్ ఫేక్ వీడియోల జోరు మాత్రం ఎక్కడా తగ్గలేదు. ఓవైపు సైబర్ క్రైమ్ సీరియస్ గా యాక్షన్ తీసుకుంటున్నా! వీడియోలు మాత్రం నెట్టింట వైరల్ అవుతూనే ఉన్నాయి. సెలబ్రిటీలే టార్గెట్ గా డీప్ ఫేక్ లు క్రియేట్ అవుతున్నాయి.



# ఉమ్మడి ఆదిలాబాద్‌ను వణికిస్తున్న చలి..





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను చలి వణికిస్తోంది. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో చలి తీవ్రత భారీగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో చలి తీవ్రత అధికంగా ఉండటంతో ఏజెన్సీ ప్రాంతాలు వణికిపోతున్నాయి. సిర్పూర్, గిన్నెదరిలో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సోనాల, తిర్యాణిలో 12.1 డిగ్రీలు, బజార్‌హత్నూర్‌లో 12.2 డిగ్రీలు, వాంకిడిలో 13 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ చలి బాగానే పెరిగింది. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిని పొగమంచు కప్పేసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

# ముగిసిన తెలంగాణ కేబినెట్ భేటీ.. గవర్నర్ ప్రసంగానికి ఆమోదం



హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ భేటీ ముగిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ఆమోదం లభించింది. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి ప్రసంగం కావడంతో ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనే దానిపై సుమారు గంటన్నరపాటు చర్చ జరిగింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఎలాంటి పరిస్థితిలో ఉంది.. రానున్న రోజుల్లో ఎలా ఉండబోతోందనే అంశాలతో గవర్నర్ ప్రసంగం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని ప్రభుత్వం మొదలుపెట్టిన విషయం తెలిసిందే. మిగతా నాలుగు గ్యారంటీల అమలుపై మంత్రివర్గ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.

# పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




హైదరాబాద్: రాష్ట్ర సమాచార, రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భాధ్యతలు స్వీకరించారు. ఈ పదవీ స్వీకార కార్యక్రమానికి మంత్రి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ, బాలు నాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీ రెడ్డి తోపాటు పలువురు సీనియర్ నాయకులు రేణుకా చౌదరి, రామసహాయం సురేందర్ రెడ్డి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ కె. అశోక్ రెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జేడీ లు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీ లు మధు సూధన్, హాష్మి, రాజా రెడ్డి, సీఐఈ రాధా కిషన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మంత్రిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

**భువనగిరిలో స్పోర్ట్ కాంప్లెక్స్‌కు 10 ఎకరాల భూమి :** భువనగిరి జిల్లా రాయగిరిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పది ఎకరాల భూమిని కేటాయిస్తూ తన మొదటి ఫెయిల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంతకం చేశారు. రూ. 9.50 కోట్ల విలువ గల పదెకరాల స్థలాన్ని మల్టి పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి చేపట్టేందుకు యువజన, క్రీడల శాఖకు కేటాయించారు.

అలాగే రాష్ట్రంలోని 33 జిల్లాల డీపిఆర్‌ఓలకు అధునాతన కెమెరాలు అందచేసే సమాచార, పౌర సంబంధాల శాఖకు చెందిన ఫైల్‌పై మంత్రి పొంగులేటి సంతకం చేశారు. గృహ నిర్మాణ శాఖకు చెందిన పలు పరిపాలనా సంబంధిత ఫైళ్లపై సంతకం చేశారు.

# స్పీకర్ ఎన్నికకు మద్దతివ్వాలని కేసీఆరే ఆదేశించారు..



హైదరాబాద్: స్పీకర్ ఎన్నికకు మద్దతు ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు అడగగానే సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం అసెంబ్లీలో స్పీకర్ ఎన్నికకు ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతూ... మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి లాగే సభా హక్కులను కాపాడాలని కోరుతున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజలు సమస్యలు చర్చకు వచ్చేలా చూడాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సిరిసిల్లకు రావాలని తాను గడ్డం ప్రసాద్‌ను ఆహ్వానించానని.. అప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఆయన రాలేకపోయారని కేటీఆర్ పేర్కొన్నారు.

# రేవంత్ పాలనపై అక్కసు: ఆర్నెల్లు కూడా ఆగలేకపోతున్న కేటీఆర్!!

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన మొదలు పెట్టింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగించేందుకు చేసుకోవలసిన సర్దుబాట్ల నేపథ్యంలో తాము ఆరు నెలల వరకు వేచి చూస్తామని, మౌనంగా ఉంటామని ఆ తర్వాత పాలన సాగించకపోతే ప్రశ్నిస్తామని కేటీఆర్ మీడియా ముఖంగా చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ విషయాన్ని పక్కన పెట్టిన కేటీఆర్ అప్పుడే అక్కసు వెళ్లగక్కుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన మొదలుపెట్టిన తొలినాళ్లలోనే అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చారంటూ, ఎలా వాటిని అమలు చేస్తారో చూస్తానంటూ కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు కేటీఆర్. రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు గుప్పించారు ఎన్నికల సమయంలో రేవంత్ చెప్పిన ప్రతి మాటకు రికార్డు ఉందని, ఆయనను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని, రాగానే పెన్షన్ 4000 ఇస్తామని చెప్పారని, పది రోజులు ఆగండి 15000 రైతు భరోసా ఇస్తామన్నారని కానీ ఇంతవరకు ఇవ్వలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మొదటి క్యాబినెట్లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు ఏమైంది అని ప్రశ్నించిన కేటీఆర్, ఇలా అనేక అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి పాలనను ప్రశ్నిస్తున్నారు. అప్పుడే తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి మొదలుపెట్టిన కేటీఆర్ కనీసం ఆరు నెలలు కాదు ఆరు వారాలు కూడా ఆగలేకపోయారు అన్న చర్చ తెలంగాణ సమాజంలో జోరుగా సాగుతుంది. తెలంగాణ రాష్ట్ర పాలన పై రేవంత్ రెడ్డి అనుకున్నది ఒకటైతే గ్రౌండ్ రియాలిటీ మాత్రం వేరుగా ఉంది. ఏ శాఖలో చూసిన అప్పుల కుప్పలు కనిపిస్తూ ఉండడంతో దిక్కుతోచని స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలకు కట్టుబడి శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక తాజా కేటీఆర్ వ్యాఖ్యలు విన్నవారు రేవంత్ పాలనను ఆయన డైజెస్ట్ చేసుకోలేకపోతున్నారని అందుకే ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని, అధికారం చేపట్టి కనీసం వారం రోజులు కూడా కాకుండానే అప్పుడే విమర్శలు మొదలుపెట్టారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజాభవన్‌లోకి భట్టి ఫ్యామిలీ గృహ ప్రవేశం

హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లోకి గృహ ప్రవేశం చేశారు. ఈరోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా పూజలు చేశారు. ఇక, గృహ ప్రవేశం అనంతరం భట్టి దంపతులు అక్కడే ఉన్న మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాభవన్‌లోకి గృహ ప్రవేశం సందర్భంగా హోమం కార్యక్రమం చేపట్టారు. ఈ హోమం కార్యక్రమంలో భట్టి దంపతులు పాల్గొన్నారు. అనంతరం, భట్టి విక్రమార్క సచివాలయానికి బయలుదేరారు. కాసేపట్లో సచివాలయంలోని తన చాంబర్‌లో భట్టి ఛార్జ్ తీసుకోనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా జ్యోతి రావు పూలే ప్రజా భవన్‌ను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చింది. ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి, ప్రజాదర్బార్‌ను కొత్త ప్రభుత్వం నిర్వహిస్తుంది. ప్రజాభవన్‌గా మారిన ప్రగతి భవన్ ఎదుట సుదీర్ఘకాలంగా ఉన్న ఇనుప కంచెను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. కాగా, రాచరికానికి చిహ్నంగా ప్రగతి భవన్ ఉందంటూ గతంలో విమర్శించిన రేవంత్.. అధికారంలోకి వచ్చాక దాని పేరును మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో సీఎం క్యాంపు కార్యాలయం కోసం ప్రత్యామ్నాయ భవనాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిసింది. సువిశాల స్థలంలో ఉన్న ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనంలో నివాసం ఉండేందుకు సకల సదుపాయాలు ఉండటం, భద్రతాపరంగా అనుకూలంగా ఉండటం, పెద్ద సంఖ్యలో వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఉండటంతో అధికారులు దీని పేరునే ముఖ్యమంత్రికి సూచించినట్లు సమాచారం. ఒకవేళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీని సీఎం క్యాంపు కార్యాలయంగా వినియోగిస్తే అక్కడ నిర్వహిస్తున్న శిక్షణ సంస్థను ప్రజాభవన్‌కు తరలించే అవకాశాలున్నట్లు తెలిసింది. ప్రభుత్వం దీనిపై త్వరలో ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

# గ్రూప్-2 రీషెడ్యూల్.. జనవరిలో పరీక్ష నిర్వహించడం కష్టమే!

హైదరాబాద్ : టీఎస్‌పీఎస్సీపై తాజాగా సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కమిషన్‌ను ప్రక్షాళన చేస్తామని ప్రకటించడం, కమిషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి సహా సభ్యులు రాజీనామాకు సిద్ధపడటం చూస్తుంటే.. రాష్ట్రంలో గ్రూప్–2 పరీక్షలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన గ్రూప్–2 పరీక్ష.. షెడ్యూల్ ప్రకారం జనవరి 6, 7 తేదీల్లో జరుగడం కష్టమేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మూడోసారి రీ షెడ్యూల్ చేయాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్రంలో గ్రూప్–2 క్యాటగిరీ కింద 18 విభాగాల్లో 783 పోస్టుల భర్తీకి గత డిసెంబర్ 29న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 5,51,943 మంది దరఖాస్తు చేశారు. సగటున ఒకో ఉద్యోగానికి 705 మంది పోటీలో ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లోనే నిర్వహించాల్సి ఉండగా, అదే నెలలో మరికొన్ని పరీక్షలు ఉండటంతో పరీక్షను వాయిదా వేసి, మరికొంత సమయం ఇవ్వాలని అభ్యర్థులు కోరారు. పరీక్షను వాయిదా వేసిన కమిషన్.. నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈలోపే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో మరోమారు వాయిదా పడింది.

**గ్రూప్–2తోపాటే 3 పరీక్షలకు కసరత్తు :** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, కమిషన్ చైర్మన్ బీ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయడం తదితర కారణాల వల్ల జనవరిలో గ్రూప్–2 పరీక్ష అసలు జరుగుతుందా? లేదా? అనే సందేహం అభ్యర్థుల్లో నెలకొన్నది. గ్రూప్–4 పరీక్ష ఇప్పటికే జరగ్గా.. గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. బయోమెట్రిక్ కారణంగా పరీక్షను రద్దు చేయడం సరికాదని, హైకోర్టు తీర్పును పునః పరిశీలించాలని కోరుతూ టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇక.. గ్రూప్–3 పరీక్ష తేదీని ప్రకటించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో త్వరలోనే గ్రూప్–2తోపాటు గ్రూప్–3 పరీక్షలకు కొత్త తేదీలను ప్రకటించాలని టీఎస్‌పీఎస్సీ యోచిస్తున్నట్టు తెలుస్తున్నది.

# బేకరీలో పేలిన సిలిండర్.. పలువురికి తీవ్ర గాయాలు




హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని కరాచీ బేకరీలో సిలిండర్ పేలింది. కరాచీ బేకరీ క్యాంటీన్లో ఒక్కసారిగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు 15 మందికి గాయాలవగా.. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.


**కరాచీ బేకరీలో ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి :** రాజేంద్రనగర్‌లోని కరాచీ బేకరీ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ 15 మంది కార్మికులకు మెరుగైన వైద్య చికిత్సలు అందచేయాలని సంబంధిత ఆధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గాయపడ్డ వారిలో ఎక్కువగా ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కార్మికులు ఉన్నారని సీఎంకు అధికారులు తెలియజేశారు. గాయపడ్డ వారిలో 8 మందిని కంచన్ బాగ్ డీఆర్డీఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: బీజేపీ




హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, హామీల అమలు జరిగే వరకు ప్రజల పక్షాన నిలబడతామని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను స్టడీ సర్కిల్‌గా మారుస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. రైతు బంధులో కోత విదించడం సరైంది కాదన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ మాట్లాడుతూ.. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ముందు ప్రమాణం చేయమని ముందే చెప్పామని, ఆ మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలందరూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముందు ప్రమాణం చేశామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటిలతో అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పుల పాలు చేసి వెళ్ళిపోయారన్నారు. ఇచ్చిన గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అమలు చేస్తుందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలకు నిధులు కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ నుంచి తెస్తారా? లేక ఇటలీ నుంచి తెస్తారా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. ఆ పార్టీపై తమ యుద్ధం మొదలైందని రాజసింగ్ పేర్కొన్నారు.

# నేనలా అనలేదు... నా మాటలను తప్పుగా ప్రజెంట్ చేశారు..



హైదరాబాద్: కాంగ్రెస్‌పై తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా ప్రజెంట్ చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు బొటాబొటీ మెజార్టీ ఉందని.. కాంగ్రెస్‌లో గ్రూప్స్ కామన్ అని అన్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి కూడా వాళ్ళ హామీలకు సహకరించదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. బలమైన ప్రతిపక్షం ఉందన్నారు. “మీరు బాగా పని చేయాల్సి ఉందని నేను చెప్పాను. మేము అన్న దాన్ని వక్రీకరించి కాంగ్రెస్ వాళ్ళే ఎక్కువ ప్రచారం చేసుకుంటున్నారు. వాళ్ళ మీద వాళ్ళకే నమ్మకం లేదు. భయపడుతున్నారు. అందుకే మేము ఒకటి మాట్లాడితే వాళ్ళు ఒకటి ప్రచారం చేసుకుంటున్నారు” అంటూ కడియం శ్రీహరి పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com